



వీఆర్సీ మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పురందేశ్వరి

22న ప్రజాపోరు

- నెల్లూరు వీఆర్సీ మైదానంలో నిర్వహణ
- పాల్గొననున్న మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్
- ఏర్పాట్లను పరిశీలించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 15 : రాష్ట్రంలో జరుగుతున్న అరాచక, అవినీతి, నిరంకుశ పాలనను ప్రజలకు తెలియజేసేలా కేంద్రం అందిస్తున్న నిధులను వైసీపీ సర్కారు దారి మళ్లించి దుర్వినియోగానికి పాల్పడుతున్న అంశాలను ప్రజలకు తెలిపేందుకు ఈ నెల 22న నెల్లూరులో ప్రజాపోరు నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తెలిపారు. నగరంలోని వీఆర్సీ మైదానంలో ప్రజాపోరు కార్యక్రమ ఏర్పాట్లను బీజేపీ ముఖ్యనాయకులతో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం పురందేశ్వరి మాట్లాడుతూ ప్రజాపోరు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రానున్నారని చెప్పారు. ఈ ప్రజాపోరు ద్వారా రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కమలదళం గళం విప్పుతుందని అన్నారు. ఇసుక, మైనింగ్ అక్రమాలపై ఇప్పటికే సమర్థవంతంగా బహిర్గతం చేశామన్న ఆమె అవినీతి మైనింగ్ జరగడం వాస్తవమని నిర్ధారణ అయిందన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా కేంద్రం వేసిన రోడ్లు బాగున్నాయని, గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని పలువురు తమ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. సొంతింటి నిర్మాణం కోసం అర్హులైన పేదలకు కేంద్రం రూ.1.8 లక్షలు ఇస్తుంటే ఈ ప్రభుత్వం నాశిరకంగా నిర్మాణాలు చేపడుతోందని ఆరోపించారు. ప్రభుత్వమే బీమా చెల్లిస్తుందని ప్రకటించిన వైసీపీ సర్కారు ఇటీవల మిచౌంగ్ తుఫాను విషయంలో నష్టపోయిన రైతులకు ఎలాంటి బీమా వర్తించకుండా మోసం చేసిందని మండిపడ్డారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించిన క్లస్టర్ సమావేశంలో పురందేశ్వరి పాల్గొని పలు అంతర్గత అంశాలపై నాయకులతో చర్చించి, దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి భానుప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వాకాటి నారాయణరెడ్డి, నాయకులు సురేంద్రరెడ్డి, భరత్‌కుమార్ యాదవ్, వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధన కోసం పట్టు

- 2వ రోజూ ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమం



నెల్లూరు : నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 15 : తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఉద్యమం గురువారం రెండవ రోజుకు చేరుకుంది. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మెడికల్ రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్సీలో మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల డబ్బుతోపాటు పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, క్లైయిములు చెల్లించాలని, సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏలను 90 శాతం నగదు రూపంలో ఇవ్వాలని, 11వ పీఆర్సీలో చెల్లించాల్సిన సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు చెల్లించాలని, 2004 సెప్టెంబరు 1వ తేదీకి ముందు నోటిఫై అయిన తరువాత నియామకపు ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నెల్లూరులో ఏపీజేఏసీ నగర శాఖ ఆధ్వర్యంలో సోమశిల, తెలుగుగంగ కార్యాలయాల ఎదుట నిలబడి నిరసన వ్యక్తం చేవారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి కన్వీనర్ నాయుడు వెంకటస్వామి, నగర శాఖ జేఏసీ చైర్మన్ చిలకా రామకృష్ణారెడ్డి, కన్వీనర్ డేగల మార్కెండేయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు

- నిర్ధారించిన రాష్ట్ర ప్రభుత్వం
- నివారణ చర్యలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష
- ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశాలు



నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 15 : జిల్లాలో బర్డ్‌ఫ్లూ వైరస్ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఇటీవల పొదలకూరు, కోవూరు ప్రాంతాల్లో వేల సంఖ్యలో చనిపోయిన కోళ్ల కళేబరాల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపగా పరిశీలించి బర్డ్‌ఫ్లూగా నిర్ధారించారు. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వైరస్ ప్రబలకుండా గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ఆయా ప్రాంతాల్లో శానిటైజేషన్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రబలకుండా చర్యలు : కలెక్టర్

బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రబలకుండా అధికారులంతా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. గురువారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో బర్డ్ ఫ్లూ నివారణపై జిల్లా కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. పొదలకూరు మండలం చాటగుట్ల, కోవూరు మండలం గమళ్లదిబ్బ గ్రామాల్లో భారీగా కోళ్లు చనిపోవడంతో పశుసంవర్థక శాఖ అధికారులు భోపాల్‌లోని టెస్టింగ్ కేంద్రానికి శాంపిల్స్ పంపారని, బర్డ్‌ఫ్లూగా నిర్ధారణ అయినట్లు తెలిపారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

ఈ వ్యాధి ప్రబలకుండా అదుపు చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం కోళ్లు మృతి చెందిన ప్రాంతానికి పది కిలో మీటర్ల పరిధిలో 3రోజులపాటు చికెన్ షాపులు మూసివేయాలని, కిలోమీటరు పరిధిలో 3 నెలలు షాపులు తెరవకూడదని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాధి సోకిన ప్రాంతం నుంచి 15 రోజుల వరకు కోళ్లు బయటకు వెళ్లకూడదని మరో ప్రాంతం నుంచి కోళ్లను తీసుకురాకూడదని చెప్పారు. చనిపోయిన కోళ్లను భూమిలో పాతిపెట్టాలన్నారు. కోళ్ల ఫారాలు, ఆయా కోళ్ల వద్ద పనిచేసే వ్యక్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి, సీఈవో ఇతర అధికారులతో కలిసి శుక్రవారం ఉదయం ఆ రెండు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలు, కోళ్ల పెంపకందారులు, దుకాణ నిర్వాహకులకు అవగాహన తీసుకురావాలని సూచించారు. ఆయా గ్రామాల్లో శానిటైజేషన్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పశుసంవర్థక శాఖ జేడీ మహేశ్వరుడు, డీపీవో సుస్మిత, సీఈవో కన్నమనాయుడు, ఆర్డీఓ మలోల, డీఎఫ్ఓ చంద్రశేఖర్, డీఎంహెచ్ఓ పెంచలయ్య పాల్గొన్నారు.



రోడ్డుపై కంపు

మండల కేంద్రమైన సంగంలో ప్రధాన రహదారి ఇది. ఇళ్లలోని మురుగు నీరు రోడ్డుపైకి ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. గడప గడపకు నిధులతో కాలువ ఎత్తు పెంచుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇప్పటికి ఆరు నెలలైంది. కానీ పనులు చేయలేదు. మురుగు మాత్రం ఇదిగో ఇలా రోడ్డుపై చేరిపోతోంది.

- సంగం



వాగు దాటితేనే గమ్యానికి..

కలిగిరి మండలంలోని గంగిరెడ్డిపాలెం పంచాయతీ, భట్టువారిపాలెం వాసులు బయట ప్రపంచాన్ని చూడాలంటే ఇదిగో ఇలా వాగు దాటాల్సిందే. ప్రతి ఏడాది వర్షాలు ప్రారంభమైతే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఈ వాగు దాటి బయటకు వస్తున్నారు. ఈ వాగుపై వంతెన నిర్మించాలని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డిని ఆయా గ్రామస్థులు వేడుకున్నారు. అయితే, రోజులు గడుస్తున్నాయి కానీ వంతెన మాత్రం నిర్మించలేకపోయారు.

- కలిగిరి

'గడప' దాటని ప్రగతి

'ఇంటింటికీ వస్తున్నాం.. మీ సమస్యలు తెలుసుకుంటాం.. వాటన్నింటినీ పరిష్కరిస్తాం..' అంటూ ఓ వైపు ఎమ్మెల్యేలు ప్రచారం చేసుకోగా, మరో వైపు 'ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నాం.. అవసరమైతే ఇంకా ఇస్తాం.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలి..' అంటూ మరోవైపు ప్రభుత్వం ఆర్భాటపు ఆదేశాలు జారీ చేసింది. కానీ చివరకు ఏం జరిగిందయ్యా అంటే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం (జీజీఎంపీ) వైసీపీ ప్రచారానికి ఉపయోగపడింది తప్ప ప్రజల సమస్యలు మాత్రం అలానే ఉండిపోయాయి. ఇప్పటివరకు చేసిన పనులకే డబ్బులు ఇవ్వలేదు.. ఇక ఇప్పుడు కొత్తగా పనులు చేస్తారా!? అంటూ మొదట్లో ప్రజలు అనుమాన పడిందే చివరకు నిజమైంది.

- వైసీపీ ప్రచారానికే పరిమితమైన జీజీఎంపీ
- ప్రజలు చెప్పిన సమస్యలకు పరిష్కారమేది..?
- ప్రచారార్భాటాలు తప్ప పనులకు నిధులేవి..?
- గుర్తించినవి 5235.. పూర్తి చేసినవి 2444..!
- బిల్లుల సమస్యతో ఆగిపోయిన పనులు



సీతారామపురంలోని తోటకాలనీ, రజక కాలనీ, బెస్తకాలనీల్లో సీసీ రోడ్లు వేస్తామన్న పాలకుల మాటలు నేటికీ నెరవేరలేదు.



బుచ్చిరెడ్డిపాళెం : పాత మినగల్లు గ్రామంలో సదరన్ చానల్‌పై నిర్మాణానికి నోచుకోని వంతెన

నెల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : 2022, మే నెలలో జీజీఎంపీ ప్రారంభమైంది. నెలలో కనీసం 20 సచివాలయాలను ఎమ్మెల్యేలు సందర్శించేలా ప్రణాళిక రూపొందించారు. దాదాపు ఏడాదిపాటు ఈ కార్యక్రమం కొనసాగింది. అయితే అప్పట్లోనే ప్రజల నుంచి నిరసన వ్యక్తమైంది. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటనలు అనేకం వెలుగుచూశాయి. దీంతో కొంత మంది ఎమ్మెల్యేలు తమకు అనుకూల మైన ప్రాంతాల్లోని తిరగగా, కొంతమం దైతే అసలు తిరగకుండానే మమ అనిపించారు. వీరు తిరిగిన ప్రాంతాల్లో మౌలిక వసతులు, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పడంతో ప్రతి గ్రామం, వార్డులో వందల సంఖ్యలో అర్జీలు అందాయి. ఒకరు రోడ్డు వేయాలని, మరొకరు కాలువ నిర్మించాలని, ఇంకొకరు లైట్లు బాగు చేయాలంటూ వినతులు ఇచ్చారు. అధికారుల నివేదిక ప్రకారం జీజీఎంపీ కింద జిల్లాలో 5235 వర్కులను రూ.225 కోట్ల అంచనాతో ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకు 2444 వర్కులను రూ.100 కోట్లతో పూర్తి చేసినట్లు చూపిస్తున్నారు. అంటే 40 శాతం కూడా సమస్యలు పరిష్కరించలేదు. పూర్తి చేసిన వర్కు ల్లో కూడా వీధిలైట్లు బాగు చేయడం, కాలువల్లో పూడిక తీయడం, చిన్న చిన్న ప్యాచ్‌లు వేయడం మినహా శాశ్వతంగా సమస్యలను పరిష్కరించలేదని క్షేత్రస్థాయిలో పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. మరోవైపు చేసిన పనులకు కూడా బిల్లులు రాకపోవడంతో మిగిలిన వర్కులను చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఎమ్మెల్యేలు, అధికారులు జీజీఎంపీ కార్యక్రమంలో తిరుగుతూ ప్రచార బుక్ లెట్లను పంపిణీ చేసేందుకు పెట్టిన ఖర్చు కూడా ప్రజల సమస్యల పరిష్కారానికి వెచ్చించలేదు.

నెల్లూరు రూరల్లో ఇంటెలిజెన్స్ నిఘా

వైసీపీని వీడుతున్న వారిపై ఆరా



నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 15 : నెల్లూరురూరల్ నియోజకవర్గంపై రాష్ట్ర ప్రభుత్వ నిఘా సంస్థలు డేగకన్ను వేశాయి. వైసీపీని వీడుతున్న వారు, టీడీపీలోకి వెళ్లాలని కసరత్తు చేసుకుంటున్న వారి వివరాలను సేకరిస్తోంది. ఇటీవల అధికార పార్టీని వీడి టీడీపీలో చేరుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో పార్టీ బలహీనపడుతుందని గ్రహించిన నేతలు దిద్దుబాటు చర్యలకు దిగారు. ప్రభుత్వ పెద్దల నుంచి జిల్లా నిఘా విభాగానికి ఆదేశాలు తెప్పించుకుని అటువంటి వారి వివరాలు సేకరిస్తున్నారు. నిఘా సంస్థలకు చెందిన అధికారులు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు ఫోన్లు చేసి ఆరా తీస్తున్నట్లు సమాచారం. అటువంటి వారి ఆదాయ వనరులను గుర్తించి ఆ దిశగా బెదిరింపులకు పాల్పడేలా అధికార పార్టీ సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు నియోజకవర్గంలో వర్గపోరును తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న నాయకులను అధికార పార్టీ నేతలు పసిగట్టి బుజ్జగింపులకు దిగుతున్నారు. తిరిగి అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవులు వస్తామని ఎర వేస్తున్నారు.

ఇక నియామకాలన్నీ విజయవాడలోనే

- వైద్య ఆరోగ్య శాఖ ప్రక్షాళన దిశగా అడుగులు
- డీఎంహెచ్‌వో కార్యాలయంపై అవినీతి ఆరోపణలు



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 15 : వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో జరిగే ఉద్యోగ నియామకాలన్నీ ఇకపై విజయ వాడలోనే జరగనున్నాయి. ఇందుకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ డాక్టర్ నివాస్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు జిల్లాస్థాయిలోనే జరిగే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ నియామకాలపై కమిషనరేట్ దృష్టి సారించింది. గతంలో జరిగిన నియమకాలలో పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆయా ఉద్యోగ నియామకాలకు భారీస్థాయిలో ముడుపులు వసూలు చేసే వారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొందరు అధికారులే ఈ అవినీతికి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో కొందరు అధికారుల వాహన డ్రైవర్లు కూడా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్యులు, నర్సులతోపాటు ల్యాబ్ టెక్నీషియన్ ఆఖరికి ఆశాల నియామకా ల్లోనూ ముడుపులు తీసుకుని భర్తీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక ఉద్యోగ నియామకాల్లోనూ నకిలీ ధ్రువీకరణ పత్రాలు ఉన్నట్లు తెలుస్తుంది. వైద్య ఆరోగ్యశాఖలోనే కాకుండా వైద్య విధాన పరిషత్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనూ ఉద్యోగుల నియామకాల్లో కొందరు అధికారులు ఈ అక్రమాలకు తెరతీశారు. దీంతో వైద్య ఆరోగ్యశాఖలో ప్రక్షాలన చేయాలని రాష్ట్రస్థాయి అధికారులు భావించారు. జిల్లాస్థాయిలో జరిగే నియామకాలన్నీ ఇక నుంచి విజయవాడలోనే జరిగేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం అమలు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 15 : ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అనుసరించి అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలు అమలు చేస్తున్నట్లు డీఈఓ పీజేవీ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగుల కోసం 5శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 4, బీసీ, మైనార్టీ, ఓసీలకు కలిపి 6శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో చేరేందుకు 25శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు విద్యాశాఖ వెబ్‌సైట్ www.cse.ap.gov.inలో ఈ నెల 23 నుంచి మార్చి 14వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని ఎంఈఓ కార్యాలయాలు, టోల్ ఫ్రీ 14417, 18004258599 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

వలంటీర్లకూ హ్యాండిచ్చారు!

- రేషన్ సరుకులు పంపిణీ చేయించి, ప్రోత్సాహక నగదు మరిచారు!
- రూ.95.87 లక్షల బకాయిలు

వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం హ్యాండిచ్చింది. ఇంటింటా రేషన్ సరుకులు పంపిణీ చేసినందుకుగాను ఒక్కో వలంటీర్లకు పారితోషకంతోపాటు రూ.750 ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సంబరపడిన వలంటీర్లు జనవరిలో పౌరసరఫరా ల శాఖ నిర్దేశించిన ప్రాంతంలో సరుకులు అందజే శారు. అయితే, రెండువారాలు గడుస్తున్నా ఇప్పటి దాకా నగదు మాత్రం వారి చేతికి అందలేదు.



నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 15 : జిల్లాలో ఇంటింటికీ రేషన్ పేరుతో ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారులకు సరుకులు అందజేస్తున్నారు. అయితే, ఆ వాహనాలను ప్రవేశపెట్టిన నాటి నుంచి నేటిదాకా ఒక్కసారి కూడా ఇంటింటికీ సరుకులు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. వీధుల్లో ఏదో ఒకచోట వాహనం ఆపి లబ్ధిదారులను అక్కడికి రమ్మని సరుకులు ఇస్తున్నారు. దీంతో వలంటీర్లను భాగస్వామ్యులను చేసి రేషన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం భావించింది. గతేడాది విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఒక్కో వలంటీరు పనిచేసే ప్రాంతంలో 5 పాయింట్లను పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఆ పాయింట్ల వద్ద ఎండీయూ వాహన ఆపరేటర్, స్థానిక వలంటీరు పర్యవేక్షలో కారుదారులకు సరుకులు పంపిణీ చేయాలి. ఇందుకు కోసం వలంటీర్లకు నెలకు ప్రోత్సాహక నగదు రూ.750 చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 1,513 రేషన్ షాపులు ఉండగా, 12,783 మంది వలంటీర్లు ఉన్నారు. జనవరి నుంచి 7.37 లక్షల కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఆ నెలకు గాను వలంటీర్లకు సుమారు రూ.95.87 లక్షలు చెల్లించాల్సి ఉండగా, ఇంతవరకు విడుదల చేయలేదు. దీంతో వలంటీర్లు రేషన్ పంపిణీకి ఆసక్తి చూపడం లేదు.

రియల్టర్లకు డబుల్ ధమాకా!

- ప్రభుత్వ సొమ్ముతో ప్రైవేటు వెంచర్, వైసీపీ నేతల భూములకు బీటీ రోడ్డు
- కావలిలో అధికారులు, పాలకుల బరితెగింపు!

కావలి, ఫిబ్రవరి 15 : కావలిలో ప్రభుత్వ ఆస్తులే కాదండోయ్.. ప్రభుత్వ సొమ్మునూ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అధికారులు, పాలకులు ధారాదత్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోరనే లేదా వాటాలు ఇస్తే సరిపోతాయనే ధీమా అధికారపార్టీ అండ ఉందని అధికారులు బరితెగిస్తున్నారు. పట్టణంలో పన్నుల రూపంలో ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్మును రియల్టర్ల అవసరాలకు వినియోగిస్తున్నారు. అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న కావలి మున్సిపాలిటీ 1వ వార్డులోని మద్దూరుపాడులో ఓ ప్రైవేటు రియల్‌ఎస్టేట్ వెంచర్‌కు నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి బీటీ డబుల్ రోడ్డు వేశారు. జాతీయ రహదారి నుంచి ఆ వెంచర్ చివరి వరకు రోడ్డు వేసేందుకు సుమారు రూ.54 లక్షలు వెచ్చించారు. ఓ బినామీ కాంట్రాక్టర్ పేరుతో అధికార వైసీపీకి చెందిన నాయ కులే ఈ రోడ్డు పనులు చేయించారు. అయితే, ఇందులోనూ నాయకులు కక్కుర్తి పడ్డారు. రోడ్డు నిర్మానానికి సగం నిధులే ఖర్చు చేశారని అధికారులు చెబుతున్నారు. అంతే గాక ఆ వెంచర్‌లో ఒక ప్రజాప్రతినిధికి కూడా వాటా ఉందనే ప్రచారం జోరుగా ఉంది. అంతేకాదండోయ్.. మద్దూరుపాడుకు చెందిన వైసీపీ నేత బంధువుకు అక్కడ పొలం కూడా ఉంది. ఆ పొలం ధర పెంచుకోవడానికి, ప్రైవేటు వెంచర్‌లో ప్లాట్ల ధరలు పెంచుకునేందుకే ఈ రోడ్డు వేశారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ప్రధాన రహదారులకు దీటుగా ఈ డబుల్ రోడ్డు వేయడంతో దానిని చూసిన ప్రజలంతా అధికారం ఉందని ప్రభుత్వ సొమ్ము ఇలా దుర్వినియోగం చేస్తారా అని ముక్కున వేలు వేసుకుంటున్నారు. అయితే, అధికారులు మాత్రం ఆ మార్గంలో ఉన్న దళిత కాలనీ పేరుతో రికార్డులో నమోదు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవ హారంపై మున్సిపల్ ప్రత్యేకాధికారి, ఆర్డీవో శీనానాయక్ మాట్లాడుతూ మద్దూరుపాడులో వేసిన బీటీ డబుల్ రోడ్డు ప్రైవేట్ వెంచర్ కోసం వేసినట్లయితే విచారంచి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మద్దూరుపాడులో రియల్టర్ల కోసం వేసిన బీటీ డబుల్ రోడ్డు


శ్రీచక్రార్చన చేస్తున్న దత్తవిజయానంద

భగవద్గీతతో జ్ఞానం, మోక్షం

- దత్త విజయానంద స్వామీజీ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 15 : భగవద్గీత శ్రవణంతో జ్ఞానం, మోక్షం లభిస్తాయని అవధూత దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద స్వామీజీ తెలిపారు. గురువారం నెల్లూరులోని సుజాతమ్మనగర్ అష్టలక్ష్మీ ఆలయంలో ఆయన అభిభాషించారు. భగవద్గీతను విద్యార్థులు, పెద్దలు ప్రతి రోజు పారాయణ చేయాలన్నారు. భగవద్గీత పారాయణ చేసిన నజీర్‌బాషాకు ఆశీస్సులు అందజేశారు. ప్రతి ఏకాదశి రోజున అష్టలక్ష్మీ ఆలయంలోని కృష్ణమందిరంలో భగవద్గీతను పారాయణ చేయాలని కోరారు. అలాగే భగవద్గీత పోటీల విజేత లను అభినందించారు. కాగా, స్వామీజీ ఉదయం శ్రీసూక్త హోమం నిర్వహించారు. అనంతరం అష్టలక్ష్మీ అమ్మవారికి, శ్రీచక్రానికి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్ కుమార్, ఏ అశోక్‌రెడ్డి, ఏ మస్తాన్‌రెడ్డి, సీసీ రత్నం, ప్రవీణ్, సురేష్, రేబాల పట్టాభిరామిరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.


హాజరైన భక్తులు

● నేడు రథసప్తమి కార్యక్రమాలు

దత్త విజయానంద స్వామీజీ ఆధ్వర్యంలో ఆలయంలో శుక్రవారం రథ సప్తమి పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం 6గంటలకు విశేష పూజ, ఆదిత్య హృదయ పారాయణం, అష్టమహాలక్ష్మికి క్షీరా భిషేకం, శ్రీచక్రార్చన, మహా సౌరయాగం, సాయంత్రం సరస్వతీ పూజ, దివ్య నామ సంకీర్తనలు జరుగుతాయని స్వామీజీ తెలిపారు.

నేడు రథ సప్తమి

- రంగనాథస్వామి ఆలయంలో సప్తవాహన సేవ
- అష్టలక్ష్మీ ఆలయంలో సౌరయాగం



నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 15 : మాఘ మాసం శక్లపక్షం సప్తమి తిథిని రథ సప్తమి పర్వడిగా జరుపుకుంటారు. ఇది సూర్య భగవానుడిని పూజించే పండుగ. ప్రతి సంవత్సరం ఈ నాటి నుంచి సూర్య కాంతి మరింత తేజోవంతమై ఆదిత్యుని శక్తి భూమికి పుష్కలంగా లభిస్తుంది. సూర్య భగవానుడిని ఆరాధించడం ద్వారా తేజస్సు, ఐశ్వర్యం, ఆరోగ్యం సమృద్ధిగా లభిస్తాయి. రథ సప్తమి రోజు సూర్యో దయ స్నానంతో సప్తజన్మల పాపాలు నశించి, రోగం, శోకం వంటివి తొలగిపోయని పెద్దలు చెబుతారు. స్నానం సమయంలో సూర్యనారాయణుడిని మనసారా ధ్యానిస్తూ, తలపై తెల్లజిల్లేడు ఆకులు, రేగు ఆకులు పెట్టుకుని స్నానం చేయాలని ధర్మశాస్త్రం చెబుతోంది. జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో ఈ పండుగకు అన్ని ఏర్పాట్లు చేశారు. నెల్లూరు అష్టలక్ష్మీ ఆలయంలో అవధూత దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానందస్వామీజీ ఆధ్వర్యంలో విశేష పూజలు, ఆదిత్య హృదయ పారాయణం, సౌరయాగం జరగనున్నాయి. మూలస్థానేశ్వరాలయంలోని సూర్యభగవానుని సన్నిధిలో ఉదయం విశేష అభిషేకాలు జరుగుతాయి. కాగా, రంగనాథస్వామి ఆలయంలో జరిగే సప్తవాహన సేవల్లో శ్రీవారు ఊరేగుతారని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సహాయ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు తెలిపారు.

● పెంచలకోనలో నేడు..

రాపూరు(డక్కిలి) : పెంచలకోన క్షేత్రంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిషనర్ సాగర్‌బాబు తెలిపారు. తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడువాహనాలపై శ్రీవారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారని తెలిపారు.


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన కోవూరు నాయకులు

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం/ఇందుకూరు పేట : కోవూరు నియోజకవర్గంలోని వైసీపీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. బుచ్చిరెడ్డి పాళెం, ఇందుకూరుపేటకు చెందిన పలువురు గురువారం విజయవాడలోని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్వగృహానికి చేరుకున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వారందరికీ చంద్రబాబు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన వవ్వేరు బ్యాంకు మాజీ చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు సూరా ప్రదీప, 3వవార్డు కౌన్సిలర్ అందే ప్రత్యూష, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పుట్టా ధనలక్ష్మి, ఆమె భర్త పుట్టా రంగనాథ్, వల్లూరు రాఘవరెడ్డి, కైలాసం పృథ్వీ, కాంగ్రెస్ కన్వీనర్ కోకిల శ్రీహరి, పంచేడు సర్పంచు తదితరులు ఉన్నారు. అలాగే ఇందుకూరుపేట మాజీ జడ్పీటీసీ సభ్యుడు కైలాసం ఆదిశేషారెడ్డి, ఆయన భార్య మాజీ ఎంపీపీ కైలాసం రేణుక టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కైలాసం రాజీనామాతో మండలంలో వైసీపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది.


కైలాసం ఆదిశేషారెడ్డి..

వారిది ధైర్యం.. వీరిది భయం!

- హైకోర్టు ఆదేశించినా అల్లీపురంలో తొలగని ఆక్రమణలు
- ఇరిగేషన్ లేఖలనూ పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- ఏడాది క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎంపీ ఆదాల
- జేసీ, విజిలెన్స్ ఎస్పీలను విచారణకు ఆదేశం
- జేసీ విచారణ పూర్తి.. ఇప్పుడు విజిలెన్స్ విచారణ ప్రారంభం
- ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలంటూ ఇరిగేషన్‌కు లేఖ
- మెడపై కత్తి వేలాడుతుండటంతో వణికిపోతున్న అధికారులు

నెల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం అల్లీపురంలో కోడూరు, బురద, పల్లపు కాలువల ఆక్రమణ వ్యవహారంలో అధికారుల మెడపై కత్తి వేలాడుతోంది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో ఆక్రమణలు తొలగించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సాహసించడం లేదు. అయితే, ఎవరి కోసమో అధికారులు వారి ఉద్యోగా లకు ఎసరు తెచ్చుకుంటు న్నారు. గతేడాది స్వయం గా నెల్లూ రు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అల్లీపురంలోని అనధి కార లేఅవుట్‌లో కాలువల ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం, దీనిపై విచారణ జరపాల్సిందిగా జాయింట్ కలెక్టర్, విజిలెన్స్ ఎస్పీలను ఆదేశించారు. అదే సమయంలో హైకోర్టు నుంచి కూడా ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు అందాయి. కానీ రాజకీయ ఒత్తిళ్లతో ఆక్ర మణలు తొలగించలేక, జరుగుతున్న విచారణలను ఎదుర్కోలేక వీటి మధ్యన నలిగిపోతున్నారు. ఎంపీ ఫిర్యాదుపై నిన్నటి వరకు జేసీ విచారించి సంబంధిత అధికారులందరినీ బాధ్యు లను చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సదరు లేఅవుట్ భూములను నిషేధిత జాబితాలో పెట్టాలంటూ జేసీ తన నివేదికలో సిఫార్సు చేసినట్లు సమాచారం. తాజాగా విజిలెన్స్ అధికారులు విచారణ మొదలైంది. ఇప్పటి వరకు ఆక్రమణల తొలగింపు వ్యవహారంలో ఎటువంటి చర్యలు తీసుకున్నారో రాతపూర్వకంగా తెలియజేయాలంటూ ఇరిగేషన్ అధికారులకు లేఖ పంపారు. దీంతో మరోసారి ఇరిగేషన్ అధికారుల్లో అలజడి మొదలైంది. ఈ విచారణలు ఎప్పటికైనా తమ మెడకు చుట్టుకుంటాయని భయపడిపోతున్నారు. అదే సమయంలో రెవెన్యూ అధికారులకు కూడా విజిలెన్స్ అధికారులు లేఖలు రాశారు. కాలువ ఆక్రమణల తొలగింపు వ్యవహారంలో రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఇరిగేషన్ అధికారులను కూడా ఇరకాటాన పెడుతోంది. కలెక్టర్ ఉత్తర్వులు, హైకోర్టు ఆదేశాల ప్రకారం ఆక్రమణలు తొలగించేందుకు సహకరించాలని పలుమార్లు ఇరిగేషన్ ఇంజనీర్లు నెల్లూరు ఆర్డీవో, రూరల్ తహసీల్దార్లకు లేఖలు రాసినా ప్రయోజనం లేకుండా పోయింది. గత నవంబరులో ఆక్రమణల తొలగింపుకు నెల్లూరు ఆర్డీవో నోటీసులు జారీ చేశారు. కానీ అంతలోనే రాష్ట్ర స్థాయి నుంచి ఒత్తిళ్లు రావడంతో నోటీసులను వెనక్కు తీసుకున్నారు.

వివరాలు అందజేశాం

అల్లీపురంలో కాలువల ఆక్రమణల తొలగింపునకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలంటూ విజిలెన్స్ అధికారులు కొన్నాళ్ల క్రితం లేఖ రాశారు. దీనిపై కింది స్థాయి అధికారులు ఇచ్చిన వివరాలను విజిలెన్స్ అధికారులకు అందజేశాం.

\- పీ కృష్ణమోహన్, ఇరిగేషన్ ఎస్‌ఈ

సిబ్బంది నిబద్ధతతో పని చేయాలి

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 15 : విద్యా శాఖలో పనిచేస్తున్న సిబ్బంది అందరూ నిబ ద్ధతతో పనిచేయడమేకాక పేద విద్యార్థు లకు నాణ్యమైన విద్య, వసతులు కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి పీజేవీ రామారావు సూచించారు. గురువారం విద్యాశాఖ జిల్లా కార్యాలయంలో ఆయన ఏడీలు, సూపరింటెండెంట్లు, అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు చదువులో రాణించేందుకు ఉత్తమ బోధన అందించాలని, వారికి ప్రభుత్వ పథకాలన్నీ సకాలంలో అందేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత పాటించాలని, విద్యార్థులంతా భోజనం తినేలా చొరవ చూపాల న్నారు. పాఠశాలల్లో జరిగే అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, కార్యాలయంలో పెండింగ్ పనులనూ పూర్తి చేయాలని ఆదేశించారు.

హైహై నాయకా.. మా మద్దతు మీకే!

- కాసులు కురిపిస్తున్న పార్టీల కండువాల మార్పిడి

కావలి : సార్వత్రిక ఎన్నికల వాతావరణం వేడెక్కడంతో చోటా నాయకులకు కాసులు కురిపిస్తున్నాయి. నజరానాల కోసం ప్రధాన పార్టీలకు చెందిన నేతల వద్దకు క్యూ కడుతున్నారు. వారు కూడా తమకు రాజకీయం బలం పెరిగిందని నిరూపించుకునేందుకు కండువాల మార్పిడిని ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఆయా పార్టీల అభిమాన నాయకులు కూడా కండువాల మార్పిడిపై మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. కావలికి చెందిన ఓ నాయకుడు వారం రోజులలో మూడు కండువాలు మార్చారు. ఓ ప్రధాన పార్టీకి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆ పార్టీ అధిష్ఠానం ఓ నేతను నియమించింది. ఇంకేముంది... మరుసటి రోజే తన అనుచరగణంతో ఆ నేత ఇంటివద్ద వాలిపోయిన నాయకుడు పార్టీ కండువా వేసుకుని మద్దతు తెలిపారు. ఆ తర్వాత రెండు రోజులకు కావలికి వచ్చిన ఓ ప్రజాప్రతినిధినీ సదరు నాయకుడు కలిసి మా మద్దతు మీకేనంటూ ఊదరగొట్టాడు. ఇటీవల జరిగిన ఓ బహిరంగ సభ వేదికపైనా సదరు నాయకుడు వాలిపోయాడు. సభాధ్యక్షుడిని గజమాలతో సత్కరించి, 'మా మద్దతు మీకే అన్నా' అంటూ నినాదాలు చేశారు. ఇలా పట్టనంలో కొంతమంది చోటా నాయకులు వ్యవహరిస్తున్న తీరును చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో కర్ణాటక మద్యం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 15: శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం రైల్వే పోలీసులు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేశారు. నెల్లూరు రైల్వే సీఐ కే భుజంగరావు తన కార్యాలయంలో నిందితుల వివరాలను మీడియాకు వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో రైల్వే పోలీసులు రైళ్లలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. గూడూరు ఎస్‌ఐ కొండప నాయుడు తన సిబ్బందితో కలిసి గురువారం తెల్లవారుజామున శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఉన్న నెల్లూరు నగరానికి చెందిన పీ కృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగ్‌ను తనిఖీ చేయగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన 39 లీటరు బాటిళ్లు, నాలుగు 750ఎంఎల్ బాటిళ్ల మద్యం కనిపించింది. ఆ సరుకును సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.


మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు

రైలు పట్టాలపై మృతదేహం గుర్తింపు

కావలి రూరల్, ఫిబ్రవరి15: కావలి ఉత్తర శివారులో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి (60) మృతదేహాన్ని కీమన్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లిన జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎం. వెంకటేశ్వరరావు రైలు పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి రైల్లో ప్రయాణిస్తూ కింద పడి మృతి చెంది ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. 5.6 ఎత్తు, చామనఛాయ తోలైట్ రోజ్ కలర్ అడ్డగీతల బులుగు రంగు టీషర్టు, ఆకుపచ్చ కలర్ లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

కలువాయి, ఫిబ్రవరి 15: మండలంలోని నూకనపల్లి వైపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని బుధవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు పోలీసులకు నిఘా ఉంచి లారీని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అయ్యప్ప తెలిపారు.

కోడి పందేలపై దాడి

- 8 కోళ్లు, రూ.2,700 నగదు స్వాధీనం

కావలి రూరల్, ఫిబ్రవరి15: కావలి మండలంలోని చెన్నాయపాలెం, పట్టపుపాలెం ప్రాంతాల మధ్య కోడి పందేల స్థావరంపై గురువారం పోలీసులు దాడులు చేశారు. ముందస్తు సమాచారంతో రూరల్ సీఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలసి నిర్వహించిన ఈ దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి 8 కోళ్లు, రూ.2,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	141
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	278
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5866
వెండి కిలో ధర	రూ. 72,000
వెండి ఒక గ్రాము	రూ. 74.00

యువకుడిపై..

- కేసు నమోదు

సంగం, ఫిబ్రవరి 15: మండలంలోని సిద్దీపురంలో పవన్ అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన సురేష్ దాడి చేయడంతో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. సురేష్, పవన్ ఇద్దరూ స్నేహితులు. అయితే ఓ మహిళ విషయంలో ఇరువురికీ మనస్పర్థలు రావడంతో మాటామాటా పెరిగి గొడవ పడ్డారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి సురేష్ దాడిచేసి కర్రతో పవన్ తలపై కొట్టాడు. దీంతో గాయపడిన పవన్‌ను 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రేపటి నుంచి సింహపురి బాలోత్సవ్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 15 : నెల్లూరులోని కస్తూరి దేవి ఉన్నత పాఠశాలలో శని, ఆదివారాల్లో సింహపురి బాలోత్సవ్ నిర్వహిస్తు న్నాట్లు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ వేడుకను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రభు త్వం, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు ఈ బాలోత్సవంలో పాల్గొనాలని కోరారు. సాంస్కృతిక, విద్యా సంబంధ అంశాలపై పోటీలు ఉంటాయని చెప్పారు. కమిటీ కార్యదర్శి మంగల పుల్లయ్య మాట్లాడుతూ కల్చరల్ ఈవెంట్‌లో శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, వెస్ట్రన్ డాన్స్, పాటల పోటీలు, విచిత్ర వేష ధారణ, ఏకపాత్రాభినయం ఉంటాయని తెలిపారు. అకడమిక్ అంశాలలో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, పద్యం, భావం, తెలుగులో మాట్లాడటం, తెలుగు కథారచన, కవితా రచన తదితర పోటీలు ఉంటాయని వెల్లడించారు. 6, 7 తరగతుల విద్యార్థులను జూనియర్స్‌గా, 8,9,10 తరగతుల వారిని సీనియర్స్‌గా పరిగణించి పోటీలు నిర్వహిస్తున్నా మని చెప్పారు. అనంతరం కరపత్రా లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎంఈవో హమీద్, నగేష్, జయరామిరెడ్డి, నరసింహారెడ్డి, భోగేశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

వేగంగా సుందరీకరణ పనులు : మేయర్


ఐ ల్యాండ్‌ను పరిశీలిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 15 : ప్రజలకు ఆహ్లాదాన్ని అందిం చేందుకు నగరమంతా సుందరీకరణ పనులను వేగంగా చేస్తున్నామని మేయర్ స్రవంతి తెలిపారు. నగరంలోని కేవీ ఆర్ పెట్రోల్ బంకు ప్రాంతంలో డివైడర్, ఐ ల్యాండ్ నిర్మాణాలను, సుందరీకరణ పనులను ఆమె గురువారం పరిశీలించారు. ఇప్పటి వరకు రూ. 1.50 కోట్ల పనులు పూర్తవగా, మరో రూ.3 కోట్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

గూడ్స్ రైలులో మంటలు

బిట్రగుంట, ఫిబ్రవరి15: బిట్రగుంట రైల్వేస్టేషన్ యాడ్ నెంబరు-2లో విజయవాడ నుంచి గూడూరు వైపు వెళ్లే గూడ్సు రైలులో బుధవారం రాత్రి మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న స్టేషన్ మాస్టర్ అప్రమత్తమై కావడంతో ప్రమాదం తప్పింది. దీంతో గురువారం యథావిధిగా రైళ్లు నడిచాయి. సేకరించిన వివరాల మేరకు, బుధవారం రాత్రి 9.30 గంటలకు బిట్రగుంట స్టేషన్ చేరుకున్న బొగ్గు లోడు గూడ్సులో పొగలు రావడం గమనించి స్టేషన్‌మాస్టర్ వెంటనే స్పందించారు. గూడ్సు బోగీని పార్మేషన్ నుంచి తొలగించి 1ఏ ప్లాట్‌ఫామ్‌కి తరలించారు. అనంతరం కావలి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి రాత్రి 11 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు శ్రమించి మంటలు ఆర్పారు. దీంతో తెల్లవారు జామున 4 గంటలకు యథావిధిగా ఆ మార్గంలో రైళ్లు నడిచాయి.

హెచ్‌ఐవీ నివారణ వేగవంతం చేయండి

- కళాజాతాల ప్రారంభంలో డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 15 : జిల్లాలో హెచ్‌ఐవీ నివారణ చర్యలను వేగవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య సూచించారు. హెచ్‌ఐవీ నివా రణపై ప్రచారం చేసేందుకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం కళాజాతాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామల, శ్రీనివాస కళాజాతాల బృందాలు ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు జిల్లాలోని నిర్దేశిత ప్రాంతాల్లో ప్రచారం చేస్తారన్నారు. హెచ్‌ఐవీ ప్రస్తుతం తగ్గుముఖం పట్టినా ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేలా కళాకారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డెమో శ్రీనివాసరావు, శివ పాల్గొన్నారు.


కళాజాతాలను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు : డీఎంహెచ్‌వో

బిట్రగుంట, ఫిబ్రవరి 15: ప్రజలకు వైద్యసేవల విషయంలో నిర్లక్ష్యం తగదని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీలో గురువారం ఆయన రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, స్థానిక సమస్యలను వైద్యులు ప్రవీణ్‌కుమార్, జీహారిక, నిత్య ప్రశాంతిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా, ఎంఎల్‌హెచ్‌ఎల్‌తో సమావేశమై మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి నెలా నిర్వహించాల్సిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జువ్వలదిన్నె వైద్యులు రాజశేఖర్, సూపర్‌వైజర్లు, సీహెచ్‌వో, పీహెచ్‌ఎన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 79 మంది గైర్హాజరు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 15 : ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యా ర్థులకు జరుగుతున్న ప్రయోగ పరీక్షల్లో గురువారం 79 మంది గైర్హాజర య్యారు. జిల్లా వ్యాప్తంగా 45 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం సెషనల్‌లో 1,702 మందికిగాను 1,693 మంది హాజరు కాగా 9 మంది గైర్హాజ రయ్యారు. మధ్నాహ్నం 1,994 మంది విద్యార్థులకుగాను 1,924 మంది హాజరుకాగా 70 మంది గైర్హాజరయ్యారు. పలు కేంద్రాలను ఆర్‌ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు, డీఈసీ సభ్యులు పరిశీలించారు.


గజిబిజి.. గందరగోళం!

- ఏ ఓటరు జాబితా చూసినా లొసుగులమయమే
- మృతులు, వలస ఓట్లు, డబుల్ ఎంట్రీలు పదిలం

ఆత్మకూరు, ఫిబ్రవరి 15 : ఓటరు జాబితాల్లో వెతికిన కొద్దీ లోపాలు బయట పడుతూనే ఉన్నాయి. నెలల తరబడి ఓటరు స్వచ్ఛీకరణపై కసరత్తు చేసినా తుది జాబితాలోనూ కుప్పలుతెప్పలుగా తప్పులు కనిపిస్తూనే ఉన్నాయి. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఏ పోలింగ్ కేంద్రంలోని జాబితా చూసినా గజిబిజి, గందరళగోళంగానే ఉన్నాయి. ముఖ్యంగా మరణ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేదని మృతుల ఓట్లను తొలిగించకుండా వదిలేశారు. అలాగే వలసదారులు, పెళ్లిళ్లు అయి వేరే గ్రామాలకు వెళ్లిన మహిళల ఓట్లను కొనసాగిస్తూనే ఉన్నారు. డబుల్ ఎంట్రీలు, జీరో డోర్ నెంబర్లలో ఓటర్లు కనిపిస్తూనే ఉన్నాయి.



ఓటరు జాబితాలో మృతుడికి ఉన్న ఓటు



తాజా జాబితాలో ఓటర ఫొటో లేకుండా..

● ఆత్మకూరు పట్టణ పరిధిలోని 143వ పోలింగ్ కేంద్రంలో దాసరి తిరిపాలయ్య మృతి చెందినా ఆయన ఓటు జాబితాలో ఉంది. జాబితాలో వరుస సంఖ్య 199, 240 ఓటర్లు మృతి చెందినా ఓటర్లుగా నమోదై ఉన్నారు. అలాగే, పోలింగ్ బూత్ 134 పరిధిలో జాబితాలో వరస నెంబరు 809లో వైకుంఠ కేశవమూర్తికి ఓటు ఉంది. కానీ ఆయన ఆత్మకూరును విడిచి వెళ్లి చాలా కాలమైంది. ఇలా ఈ బూత్ పరిధిలో 29 వలస ఓట్లు ఉన్నాయి.

● ఆత్మకూరులోని 150 పోలింగ్ కేంద్రంలో మొత్తం 656 ఓట్లు ఉండేవి. అందులో 31 ఓట్లను నూతనంగా చేర్చి, 58 ఓట్లు తొలిగించారు. దాంతో ప్రస్తుతం 629 ఓట్లు ఉన్నాయి. వాటిలో పెడెం చినమాలకొండయ్య, నలగాట పెంచలయ్య ఓట్లు తొలిగించారు. పోలింగ్ కేంద్రం 144లో కె చినపురెడ్డి(73), తుమ్మల చిన్నమ్మ(77) చనిపోయినా వారి ఓట్లు తొలిగించలేదు. మరోవైపు తుమ్మల కొండారెడ్డి, తుమ్మల మల్లెంకొండారెడ్డి పేర్లతో చిన్న మార్పుతో డబుల్ ఎంట్రీ ఉందని స్థానికులు చెబుతున్నారు.

సోమశిలలో 21.267 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఫిబ్రవరి 15: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి జలాశయంలో 21.267 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తర కాలు వకు 600, దక్షిణ కాలు వకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



గుక్కెడు నీటి కోసం పల్లెవాసుల పాట్లు

ముందుకు సాగని తాగునీటి పథకాలు

వరికుంటపాడు, ఫిబ్రవరి 15: మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఏళ్ల తరబడి తాగునీటి సమస్యలు వెంటాడుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేడని, గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడాల్సివస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం శుద్ధి నీటిని అందించేందుకు తీసుకొచ్చిన పథకాలు అందని ద్రాక్షా గానే ఊరిస్తున్నాయి. సురక్షిత తాగునీటిని అందించే సంగతి అటుంచితే కనీసం పనులు సైతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా నిలిచి వెక్కిరిస్తున్నాయి. 80శాతం వరకు పూర్తయిన పథకాలను అందుబాటులోకి తీసుకురాకపోవడం ఒకవంతైతే మరమ్మతులకు గురైన పథకాలను కూడా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వేసవి ప్రభావం అధికమవుతుండడంతో క్రమేణా భూగర్భ జలాలు అడుగంటిపోయే పరిస్థితులు నెలకొన్నాయని గ్రామస్థులు వాపోతున్నారు.

పేరు మార్చినా ఫలితం శూన్యం

గత తెలుగుదేశం ప్రభుత్వం 2018లో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు తాగునీరు అందించేందుకు గాను రూ. 15 కోట్ల నిధులను మంజూరు చేసింది. 2019 మార్చి నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉండగా అప్పట్లో జోరుగా సాగిన పనులు అనంతరం జరిగిన ఎన్నికల పుణ్యమాని నిలిచిపోయాయి. ఆపై అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2021లో హడావిడిగా ఆ పథకానికి వైఎస్ఆర్ సుజల స్రవంతిగా పేరు మార్చి పునరుద్ధరించినా ఫలితం లేకుండా పోయింది. పేరు మార్చినప్పటికీ సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడంతో అధికశాతం మంది కాంట్రాక్టర్లు తమ పనులను ఎక్కడికక్కడే నిలిపివేసి వెనుతిరిగి వెళ్లిపోయారు. దీంతో ఆ పథకం పల్లె ప్రజలకు అందని ద్రాక్షాగానే మారింది.



కొండ్రాజుపల్లి వద్ద మరమ్మతులకు గురైన చేతిపంపు



గువ్వాడిలో నిరుపయోగంగా ఉన్న మినీ వాటర్ ట్యాంకు

శిథిలావస్థలో చేతిపంపులు

పలు గ్రామాల్లో లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాలు ఏళ్ల తరబడి మరమ్మతులకు గురై తలుపులు తెరుచుకోకపోవడం చూస్తుంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. అలాగే కొండ్రాజుపల్లి, తూర్పుబోయమడగల బస్టాండ్ సెంటర్లతో పాటు పలు గ్రామాల్లోని చేతిపంపులు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా దర్శనమిస్తుండడంతో ప్రజలతో పాటు ప్రయాణికులు గుక్కెడు నీటి కోసం గంటల తరబడి కుస్తీలు చేసి విసుగెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి పథకాలను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



సరస్వతి పూజలో పాల్గొన్న బాలికలు

సంగం, ఫిబ్రవరి 15: స్థానిక బీసీ బాలికల వసతిగృహంలో గురువారం సరస్వతీ పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు పరీక్షలు బాగా రాయాలని సరస్వతిదేవికి మొక్కుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేట్రిన్ మల్లీశ్వరి, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

చేజర్ల, ఫిబ్రవరి 15: మండలంలోని ఆదురుపల్లి గ్రామంలో గురువారం ఆత్మకూరు శాసనసభ్యుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాలలో ఇప్పటివరకు గ్రామాలలో చేసిన అభివృద్ధి, చేపట్టబోవు కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ వీర్ల పార్థసారధి, వీరరాఘవరెడ్డి, సిద్దులనాయుడు, రవీంద్ర, కోటయ్య, రాంబాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వీవీ ప్యాడ్‌లపై ఓటర్లకు అవగాహన



వీవీ ప్యాడ్‌లపై అవగాహన కల్పిస్తున్న వీఆర్వో

సంగం, ఫిబ్రవరి 15: మండలంలోని జండాదిబ్బ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగంపై గురువారం ఓటర్లకు అవగాహన కల్పించారు. వీఆర్వో సుధాకర్ ఈవిఎం, వివి ప్యాడ్స్‌పై ఓటు వినియోగం, అవి పనిచేసే విధానం ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వరికుంటపాడు, ఫిబ్రవరి 15: మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో ఇటీవల మృతిచెందిన షేక్ సుబహానీ కుటుంబానికి గురువారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. సంస్థ అధ్యక్ష, కన్వీనర్లు పోలక తిరుపతిరెడ్డి, వెండిదండి వెంకటేశ్వరరెడ్డి మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తమవంతు చేయూతగా రూ. 27,500 నగదు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాషామొహిద్దీన్, డైరెక్టర్ కాకు నాగేశ్వరరావు, సభ్యులు పీ మాల్యాచలం, ఎం నారాయణ, షేక్ హుస్సేన్, షేక్ చాంద్‌బాష, ఎం తిరుపతిరెడ్డి, వై వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి ఘన సన్మానం



ఎస్ఐను సన్మానిస్తున్న సర్పంచులు, నాయకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 15: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచి జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ఉదయగిరి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిని గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సర్పంచులు, నాయకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అలాగే విధి నిర్వహణలో ప్రతిభ కనపరిచి ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న కోర్టు కానిస్టేబుల్ సుబ్బయ్యను సైతం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, సర్పంచులు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, నాయకులు దారపనేని చెన్నయ్య, దర్వేష్, గురవయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

గృహాల రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలి



సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న తహసీల్దారు, ఎంపీడీవో

ఏఎస్ పేట, ఫిబ్రవరి 15: స్థానిక సచివాలయాన్ని గురువారం తహసీల్దారు రవికుమార్ ఎంపీడీవో వెంకటేశ్వర్లుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. జగనన్న గృహల రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తిచేయాలన్నారు. సచివాలయ అధికారులు సమయ పాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వరికుంటపాడు, ఫిబ్రవరి 15: స్థానిక జాతీయ రహదారి సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ బింబ ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం వ్యవస్థాపకులు పెండ్యాల సూర్య నారాయణ, అమ్మాజీ దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. తితిదేకు చెందిన పురోహితులు శాస్త్రోక్తంగా గోపూజ, పుణ్యహవాచనం, రక్షాబంధనం, వాస్తుపూజ, హోమాలు, పారాయణం, త్యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, ధాన్యాదివాసం తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అల్పాహారంతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఉదయగిరి, ఫిబ్రవరి 15: ఉదయగిరి పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక బీసీ కాలనీ, స్టేట్‌పేట తదితర ప్రాంతాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే అప్పసముద్రం, గుడినరవ గ్రామాల్లో ప్రజా సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గొల్లపల్లి తిరుపతి, మట్ల శాంతి, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

స్థానిక దేవలాలగడ్డ ప్రాంతానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు షేక్ హుస్సేన్ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వెళ్లి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, నాయకులు ఎస్థాన్, ముర్తుజాహుస్సేన్, ఉప్పుటూరి శ్రీనివాసులు, నజీముద్దీన్, సర్ఫుద్దీన్, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను అమలుచేసే వారికే మా ఓట్లు

● యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టుకార్డుల ఉద్యమం



పోస్టుకార్డులను ప్రదర్శిస్తున్న యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 15 : ఎవరైతే సీపీఎస్, జీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీం)ను అమలుచేస్తారో వారికే మా ఓట్లు వేస్తామని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఈమేరకు మండలంలోని కరటంపాడు, ఆత్మకూరు, మురగళ్ల తదితర పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వివిధ రాజకీయ పార్టీలకు పోస్టుకార్డు ద్వారా తమ వినతులను అందజేస్తామని, అన్ని రాజకీయ పార్టీల జిల్లా, మండల నాయకులందరికీ మెమోరాండాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాధర్, శివప్రసాద్‌రావు, మాజీ జిల్లా కార్యదర్శి ఎం గంగాధర్, ఆత్మకూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ రామ్మోహనరావు, షేక్ ఖాదర్‌బాష, ఈశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

ఆత్మకూరు, ఫిబ్రవరి 15: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం చేపట్టనున్న దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆత్మకూరు మండల కమిటీ నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు చేపట్టే నిరసన ప్రదర్శనలో పాల్గొనాలని కోరారు.

జీవవైవిధ్యంపై అవగాహన సదస్సు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 15: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఫస్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం జీవవైవిధ్యం సంరక్షణపై సర్పంచులు, కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంపీడీవో ఈశ్వరమ్మ మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో జీవవైవిధ్య సదస్సులు నిర్వహించాలన్నారు. జీవవైవిధ్య కార్యాలయాలకు బోర్డులు, అవసరమైన సామాగ్రి సమకూర్చుకోవాలన్నారు. జీవవైవిధ్య సంరక్షణ పుస్తకాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫస్ డైరెక్టర్ పీవీ రమణయ్య, సర్పంచ్‌లు నెల్లూరు వెంకటస్వామినాయుడు, మొండ్రు తిరుపతి, నాయకులు కల్లూరి కృష్ణారెడ్డి, సత్తెనపల్లి శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శులు కరీముల్లా, చంద్రశేఖర్, చినబాబు పాల్గొన్నారు.

ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

బిట్రగుంట, ఫిబ్రవరి 15: కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ కలసి సమన్వయంతో పనిచేయాలని కావలి ఆర్డీవో శీనానాయక్ అన్నారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై గురువారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సమావేశం జరిగింది. కావలి డివిజనల్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో శాఖలవారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై చర్చించారు. ముఖ్యంగా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉండేలా చూడాలని, దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఆరోగ్యపరంగా తగు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించారు. భద్రత విషయంలో పోలీసు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాకృష్ణ, ఆలయ సిబ్బంది, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీగా అభివృద్ధి చేసేందుకు కృషి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 15: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలను యూనివర్సిటీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 21వ తేదీన దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి రెండో వర్ధంతి సందర్భంగా గురువారం ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి కళాశాలలో చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గౌతంరెడ్డి వర్ధంతి రోజునే వ్యవసాయ కళాశాల ఆవరణలో సుమారు రూ.7 కోట్ల వ్యయంతో స్మృతివనం, కాంస్య విగ్రహం ఏర్పాటు పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ టీ గోపీకృష్ణ, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, నాయకులు కల్లూరి కృష్ణారెడ్డి, సర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేద్దాం !

● కావలి టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో నేతలు



నెల్లూరులో జరిగిన సమావేశంలో పాల్గొన్న సోమిరెడ్డి, నారాయణ, బీద రవిచంద్ర తదితరులు

కావలి, ఫిబ్రవరి 15 : కావలి నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా అందరం సమష్టిగా పని చేద్దామని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నెల్లూరులోని టీడీపీ నేత మాలేపాటి సుబ్బానాయుడు నివాసంలో మాజీ మంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, కావలి ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడు, మాలేపాటి రవీంద్ర నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జులతో సమావేశం జరిగింది. త్వరలో జరగాల్సిన టీడీపీ సమావేశాలపై వారు చర్చించారు. ఎలాంటి అశ్రద్ధ లేకుండా ఏ చిన్న అవకాశాన్ని వదులుకోకుండా కార్యకర్తలు, నాయకులు శ్రమించాలని అన్నారు. పార్టీలో ఎలాంటి విభేదాలు, గ్రూపులు లేకుండా కలిసి కట్టుగా పనిచేసి కృష్ణారెడ్డిని గెలిపించి రాష్ట్రంలో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు.

● తుమ్మలపెంట రోడ్డు అభివృద్ధికి కృషి : కావ్య

కావలి : టీడీపీ అధికారంలోకి రాగానే తుమ్మలపెంట రోడ్డుకు మోక్షం కల్పిస్తామని కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి చెప్పారు. కావలి రూరల్ మండలం తుమ్మలపెంట, అన్నగారిపాలెం పంచాయతీలకు చెందిన పలు గ్రామాల ప్రజలు గురువారం ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో కావ్యను కలిశారు. ఈ సందర్భంగా వారు తుమ్మలపెంట రోడ్డు పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ నిధులు ఆలస్యమైనా, సొంత నిధులు వెచ్చించి రోడ్డు బాగుచేయిస్తానన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పాత పథకాలతోపాటు భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను కూడా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆవుల రామకృష్ణ, సోమయ్యగారి రమణ, శ్రీనుబాబు, వాయిల శ్రీను, చంచంగారి శ్రీనివాసులు, పులి సుధాకర్, మస్తాన్, తాతా శివ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల చేరిక

కాగా కావలి రూరల్ మండలం చినపట్టుపుపాలెంకు చెందిన వైసీపీ నాయకులు, సానుభూతిపరులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. నాగన్నగారి రాంబాబు, ఆవుల నరసింహం, నాగన్నగారి బాబు, వాయిల గోవింద్, నాగన్నగారి ప్రసాద్, ప్రళయకావేరి అంజిబాబు, కాటంగారి పెంచల్, ప్రళయకావేరి పోలిరెడ్డి తదితరులకు కావ్య క్రిష్ణారెడ్డి కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● దుష్టపాలనకు చరమగీతం : బొల్లినేని

కలిగిరి : వైసీపీ దుష్ట పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. కలిగిరి మండలంలో గురువారం ఆయన ప్రజాదీవెన యాత్రను పారంభించారు. ముందుగా గ్రామ దేవత కలిగిరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రచారం మొదలుపెట్టారు. దుకాణదారుల వద్దకు వెళ్లి సైకిల్ గుర్తుకి ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ కొండపల్లి వెంకట్రావు, నిశ్శంకర సురేష్‌ల ఆధ్వర్యంలో పాతూరు వాసులు రహదారిపై బీవీఆర్ వెల్‌కం.. అంటూ పూలతో స్వాగతం పలికారు. చిన్నారులు సైతం జెండాలు చేతపట్టి బొల్లినేని వెంట కదిలారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పీ చెంచలబాబు యాదవ్, బీవీ రామారావు, వెంకటసుబ్బయ్య, బిజ్జం కృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఊసా మాల్యాద్రి, కాకు మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కావలి : టీడీపీ శ్రేణులతో కలిసి విక్టరీ సింబల్ చూపుతున్న కావ్య



కలిగిరి : కలిగిరమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బొల్లినేని తదితరులు

వేళకు రాని వైద్యులు

● రోగులకందని సేవలు



డాక్టర్ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 15: స్థానిక పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడంలేదు. ఉదయం 10 గంటలు దాటినా ఒక్కరూ కూడా విధులకు హాజరు కాలేదు. పది దాటాక ఒక్కొక్కరుగా విధులకు హాజరవుతున్నారు. ఈ పీహెచ్‌సీలో ముగ్గురు వైద్యులు, సీహెచ్‌వో, పీహెచ్‌ఎన్, మహిళ ఎంపీహెచ్‌ఎస్, పురుష ఎంపీహెచ్‌ఎస్, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మసిస్ట్, ఎఫ్ఎన్‌వో, అటెండర్ తదితరులు ఉన్నారు. అయితే ఏ ఒక్కరూ కూడా సమయపాలన పాటించడంలేదు. దీంతో రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తున్నది. అయినా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా వారు స్పందించి వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాలకొండలో నేడు వేలం పాటలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 15 మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని కల్యాణ మండపంలో ఈనెల 1న జరగాల్సిన దుకాణాల వేలం పాటలు వివిధ కారణాలతో వాయిదా పడ్డాయని, వీటి వేలం ఈనెల 16వతేదీ మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ డీసీ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆ ప్రతిపాదనలు సిగ్గుచేటు !

కందుకూరు, ఫిబ్రవరి 15: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను మరో రెండేళ్లు పొడిగించాలని, వైసీపీ నేతలు చేస్తున్న ప్రతిపాదనలు వారి చేతకానితనానికి నిదర్శనమని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. అమరావతిలో అప్పటి సీఎం చంద్రబాబు అవసరమైన సదుపాయాలన్నీ ఏర్పాటుచేయటంతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా అన్నిప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని ఆయన గుర్తుచేశారు. జగన్మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అమరావతి అభివృద్ధిని గాలికొదిలేశారని పేర్కొన్నారు. పాలకులు మరో రెండేళ్లు హైదరాబాద్‌నే ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని కోరుతుండటం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు.

ఇస్కపల్లిలో ఈవీఎంపై అవగాహన

అల్లూరు, ఫిబ్రవరి 15: మండలంలోని ఇస్కపల్లిలో గురువారం ఈవీఎంపై ప్రజలకు అధికారులు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ఈవీఎంను ఏర్పాటు చేసి దాన్ని ఎలా వినియోగించుకోవాలో వివరించారు. అనంతరం ప్రజల అడిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి పాటి రంజిత్‌కుమార్, నాయకులు బీద రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బోర్డులో ఉద్యోగావకాశాలు

కలిగిరి, ఫిబ్రవరి 15: స్థానిక పొగాకు బోర్డు కార్యాలయంలో 2024 వేలం సీజన్‌కు సంబంధించి సీజనల్ క్లర్క్ ఉద్యోగానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వేలం నిర్వహణాధికారి వీ మహేష్‌కుమార్ తెలిపారు. డిగ్రీ విద్యార్హత ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను పూర్తిచేసి పొగాకు బోర్డులో ఈ నెల28లోగా అందించాలని కోరారు.

ఫ్రిజ్‌ల బహూకరణ

కావలిటౌన్, ఫిబ్రవరి15: కావలి జంగాలకాలనీలో నూతన వధూవరులైన రెండు పేద జంటలకు శానం కృష్ణ, ప్రణీత దంపతులు గురువారంఫ్రిజ్‌లను బహూకరించారు. ఈ సందర్భంగా శానం కృష్ణ మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి పేదల వివాహాలకు విలువైన గృహోపకరణాలు, బంగారు తాళిబొట్లు, బంగారు కమ్మలు బహూకరిస్తున్నామని తెలిపారు. ఇకపై కూడా ఇదే ఆనవాయితీని కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి, కరిష్మా, గౌస్‌బాషా, అలీ, ఖలీల్, షాహుల, వలీ తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌పై పోస్టు కార్డుల ఉద్యమం



పోస్టుకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

లింగసముద్రం, ఫిబ్రవరి 15: ఓట్ ఫర్ ఓపీఎస్ ఉద్యమంలో భాగంగా రాష్ట్రంలోని రాజకీయ పార్టీల అధ్యక్షులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టు కార్డులు రాశారు. గురువారం స్థానిక హైస్కూల్‌లో జిల్లా కార్యదర్శి కిలారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పార్టీ అధ్యక్షులు సీపీఎస్‌పై వారి వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని, అలా ప్రకటించిన వారికే తమ మద్దతు ప్రకటిస్తామన్నారు. ఈ సందర్భంగా వారు పోస్టుకార్డులను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం. యూ మాధవరావు, యూటీఎఫ్ నాయకులు కే ప్రభాకర్, ఎం కొండయ్య, ఎం సుధాకర్‌రావు, షేక్ మస్తాన్‌వలి, డి మాధవరావు, సతీష్ పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన



ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

కావలిటౌన్, ఫిబ్రవరి15: కావలి డివిజన్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎస్ శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం ఉద్యోగులు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆర్డీవోకు వినతిపత్రం అందించారు.అనంతరం శివకుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలన్నారు. 12వ పీఆర్సీపై దాటవేత వైఖరి విడనాడి వెంటనే తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు మధుసూదన్‌రావు, దీక్షితులు, బ్రహ్మయ్య, ఉమాశంకర్, ఆకుల రమణయ్య, రాజు, షాహుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

● మత్తుపదార్థాల విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలి

కావలి : మత్తు పదార్థాలు అమ్మేవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ కావలి ప్రాంతంలో కొందరు గంజాయి, ఇతర మత్తు పదార్థాలను యథేచ్ఛగా విక్రయిస్తున్నా రన్నారు. బెల్టు షాపులు కూడా విచ్చలవిడిగా ఉన్నాయని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చౌటూరి వెంకటరత్నం, జరుగుమల్లి విజయరత్నం, జనార్దనరావు, గోళ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి పూజలు ఎంతో శ్రేష్ఠం

బిట్రగుంట, ఫిబ్రవరి 15: రథసప్తమి పూజలు ఎంతో శ్రేష్ఠమని ప్రసన్న ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణాచార్యులు అన్నారు. బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలోని ఆలయ ప్రాంగణంలో ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం రథసప్తమిని పుర్కరించుకుని ఆలయంలో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజాభిషేకాలు జరుగుతాయన్నారు. ఉదయం 6.30 గంటలకు స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతారని, అనంతరం అన్నదానం, రాత్రికి చంద్రప్రభ వాహనోత్సవం జరుగుతుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చక బృందం, పాలక మండలి సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

వారబందీ పద్ధతిలో సాగునీరివ్వాలి

బిట్రగుంట, ఫిబ్రవరి 15: వారబందీ పద్ధతిలో సోమశిల నీటిని విడుదల చేస్తే రైతులంతా పంటలు పడించుకుంటారని సీపీఎం జిల్లా నాయకుడు పీ శ్రీరాములు అన్నారు. బోగోలులో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు వేసిన రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సోమశిల నీటిని వారబందీ పద్ధతిలో విడుదల చేస్తే సాగునీటి సమస్య పరిష్కరించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వెంకయ్య చల్లా నరహరి తదితరులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు : ప్లేస్‌మెంట్స్ కోసం ఇచ్చే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య పేర్కొన్నారు. కళాశాలలో రెండువారాలుగా మాక్స్ సంస్థ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏర్పాటుచేసిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా కార్పొరేట్‌రంగంలో ఉద్యోగ నియామకాల సంక్షోభం నెలకొని ఉన్నా మెజారిటీ విద్యార్థులను ఉద్యోగపత్రాలతో పంపటంలో టెక్నికల్ డైరెక్టర్ కె. విజయ్ శ్రీనివాస్ విజయం సాధించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదును అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె. విజయ్‌శ్రీనివాస్, మాక్స్ సంస్థ ప్రతినిధి కోటిరెడ్డి, ప్లేస్‌మెంట్స్ కో ఆర్డినేటర్స్ బాలకృష్ణ, కే కోటయ్య, ఎస్. మాధవరావు, సురేష్, వీ శ్రీనివాసరెడ్డి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటిరెడ్డి

రోడ్లపై పశువుల సంచారం

ప్రమాదాల బారిన జనం

పొదలకూరు, ఫిబ్రవరి 15: పట్టణంలోని రోడ్లు, ప్రధాన కూడళ్లలో పశువుల సంచారంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పొదలకూరు ఆర్టీసీ బస్టాండు, పంచాయతీ బస్టాండు, గేట్ సెంటర్ పరిసరాల్లో పశువులు ఎక్కువగా సంచరిస్తూ అక్కడ వ్యాపారులు, కొనుగోలు దారుల చేతుల్లోని కూరగాయలను తినేస్తున్నా యి. వాటి యజమానులు పాలు ఇచ్చే సమయా నికి ఇంటికి తోలుకెళ్లి తర్వాత బహిరంగ ప్రదేశాల్లో విడిచి పెట్టేస్తుండడంతో రాత్రి, పగలూ తేడా లేకుండా గుంపులు గుంపులుగా కాలనీల్లో సంచరిస్తున్నాయి. ప్రధాన రహదారులు, కూడళ్లలో వాహన చోదకులపై పడుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిసార్లు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వాటి వ్యర్థాలతో వీధులు అపరిశుభ్రంగా తయారవు తున్నాయి. ఇటీవల జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి ఒక సమావేశంలో మాట్లాడుతూ రాత్రులు రోడ్లపై ఉన్న పశువులే ప్రమాదాలకు కారణమని, యజమానులపై తగు చర్యలు తీసుకోవాలని హెచ్చరించిన సందర్భాలు కూడా ఉన్నాయి.



రాత్రివేళలో రోడ్డుపై ఉన్న పశువులు

● అలా చేయకపోవడంతోనే..

అధికారులు పశువుల యజమానులతో తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి హెచ్చరించాలి. వాటిని ఇళ్లలోనే పెంచుకోవాలని సూచించాలి. బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెడితే వాటిని పట్టుకుని బందిల దొడ్డికి తరలించాలి. యజమానుల నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలి. కానీ కొంత కాలంగా ఇవేమీ జరగడం లేదు. దీంతో యజమానులు ఇష్టారీతిగా వీధుల్లో వదిలేస్తుండడంతో సమస్య రోజురోజుకి ఎక్కువవుతోంది.

విరువూరులో అభివృద్ధి పనుల ప్రారంభం

పొదలకూరు, ఫిబ్రవరి 15 : మండలంలోని విరువూరు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. గురువారం గిరిజన కాలనీలో రూ.10లక్షలతో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మితమైన రామాలయం విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. సైడు డ్రైయిన్లను ప్రారంభించారు. జల జీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికీ రక్షిత నీటి కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. ఏపీఎస్‌పీడీసీఎల్ సెక్షన్ ఆఫీస్ కమ్ కంట్రోల్ రూమ్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బచ్చల సురేష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, దశకంఠాద్రి శర్మ పాల్గొన్నారు.

బైక్ బోల్తా : ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, ఫిబ్రవరి 15: మోటార్‌బైక్ బోల్తాపడి ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలోని కందలపాడు క్రాస్ రోడ్డు వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పొదలకూరుకు చెందిన అశోక్, ప్రసాద్ మోటార్‌బైక్‌పై కందలపాడు వైపు నుండి కసుమూరు మీదుగా పొదలకూరుకు వెళ్తుండగా కందలపాడు క్రాస్ రోడ్డు వద్ద ఆటో అడ్డురావడంతో తప్పించే క్రమంలో బైక్ బోల్తాపడింది. ప్రమాదంలో ఇద్దరూ గాయపడగా కసుమూరు ఆసుపత్రికితరలించి చికిత్స అందించారు.

మైపాడు రోడ్డుకు మహర్దశ : ఆదాల



అధికారులకు జ్ఞాపికలు ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కల్యాణ్‌రెడ్డి

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 15 : దువ్వూరు కల్యాణ్‌రెడ్డి కృషితో మైపాడు రోడ్డుకు మహర్దశ పట్టిందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని డేవిస్‌పేట యాగర్ల సెంటర్ల వద్ద మైపాడు రోడ్డుకు శంకుస్థాపన జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నెల్లూరు నగర మేయర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదాల మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నాటి మండల ప్రజలు కల దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి కృషితో నేటికి నెరవేరిందన్నారు. రోడ్డు విస్తరణ పనులకు కళ్యాణ్‌రెడ్డికృషితోపాటు డీఆర్‌డీవో చైర్మన్ గుండ్రా సతీష్‌రెడ్డి సహకారం కూడా ఉందన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రజిత్‌కుమార్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, జడ్పీవైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా తాగునీటి ట్యాంకులు



గండవరంలో శుభ్రతకు నోచుకోని తాగునీటి ట్యాంకు

కొడవలూరు ఫిబ్రవరి 15: గ్రామీణులకు పరిశుభ్రమైన తాగునీటిని అందిం చాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామాల్లో రక్షిత నీటి పథకాలను ఏర్పాటు చేసింది. ఓవర్‌హెడ్ మినీ ట్యాంక్ ఏర్పాటు చేసి కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తు న్నారు. అయితే ఆయా ట్యాంక్‌లను శుభ్రం చేయక పోవడం వల్ల తాగునీరు కలుషితమవుతోంది. దీంతో గ్రామీణులు రోగాల బారిన పడుతున్నారు. మండల పరిధిలో 24 పంచాయతీలు ఉండగా, సుమారు 36 వరకు ఓవర్‌హెడ్ ట్యాంకులున్నాయి. ఆయా పంచా యతీల్లో పారిశుధ్య సిబ్బంది నెలకు రెండుసార్లు నీటి ట్యాంకులు శుభ్రం చేయాల్సి ఉంది. శుభ్రం చేశాక క్లోరినేషన్ చేయాల్సి ఉన్నా ఆదిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నీటి నమునాలను పరీక్షించడానికి కిట్లు సరఫరా చేసినా, వాటిని వినియోగించక మూలపడేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకులను సకాలంలో శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి

వెంకటాచలం, ఫిబ్రవరి 15 : మండలంలోని చెముడుగుంట పంచాయతీ బూరాన్‌పూర్ గ్రామంలో జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం నెల్లూరుకు చెందిన జయభారత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రారంభించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో జయభారత్ హాస్పిటల్ డాక్టర్ ఓబులేశు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దోర్నాదుల వెంకటేశ్వర్లు, అధ్యాపకులు జాకీర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెంచురామారావు, ఉపాధ్యాయుడు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



పూర్ణిమ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి సోమిరెడ్డి

పొదలకూరు, ఫిబ్రవరి 15: పట్టణంలోని రామమందిరం వీధిలోని టీడీపీ నాయకుడు చింత గింజల గిరి కుమార్తె చింతగింజల పూర్ణిమ అనారోగ్యంతో మృతిచెంద డంతో గురువారం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని డేగపూడి గ్రామంలో కురిచెర్ల వెంకటేశ్వర్లు విద్యుదాఘాతంతో మరణించడంతో ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

● దంపతులకు సోమిరెడ్డి ఆశీస్సులు

మండలంలోని మర్రిపల్లి గ్రామంలో వెంపులూరు వెంకటేశ్వర్లు గౌడ్ కుమారుడు శ్రీకాంత్‌గౌడ్, పూజిత దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నంనాయుడు, బక్కయ్యనాయుడు, అక్కెం సుధాకర్‌రెడ్డి, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దేవినేని శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కోవూరులో ఉద్యోగుల ఆందోళన



కోవూరు : నినాదాలు చేస్తున్న ఎన్జీవో సంఘ నాయకులు

కోవూరు, ఫిబ్రవరి 15: పింఛన్‌దారులకు, ఉద్యోగులకు మధ్యంతర భృతి కల్పించాలని కోరుతూ ఉద్యోగ సంఘాల నాయకులు గురువారం తహసీల్దారు కార్యాలయంలో ఆందోళన చేశారు. సమస్యల పరిష్కారానికి ఉద్యోగ సంఘాల నాయకులు నల్లరిబ్బన్లు ధరించి నినాదాలు చేశారు. ఎన్జీవో సంఘం తాలూకా యూనిట్ అధ్యక్షుడు దిలీప్, కార్యదర్శి కోటేష్ , ఎన్జీవో కిరణ్‌కుమార్ ఆందోళనలో పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాధాకృష్ణ గౌడ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 15: రియల్ ఎస్టేట్ వ్యాపారుల సం ఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ముక్కు రాధాకృష్ణ గౌడ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నగరంలోని మాగుంట లేవుట్‌లో గురువారం రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కోడూరు ధనేష్ నాయుడు, కార్యదర్శిగా దామెర్ల శివప్రసాద్, సహాయ కార్యదర్శిగా గంజం పెంచల ప్రసాద్, కోశాధికారిగా కోనురు వెంకట సుధీర్, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్ నరేష్ యాదవ్, తాళ్ల పెంచల కుమార్ గౌడ్‌ను ఎన్నుకున్నారు.

ఎస్‌బీఐ ఖాతాదారులకు కుట్టు మిషన్ వితరణ

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 15 : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఎస్‌బీఐ అధికారులు ఓ మహిళా ఖాతాదారురాలికి జీవనోపాధి కల్పించేందుకు కుట్టు మిషన్ వితరణ చేశారు. గురువారం నెల్లూరు రూరల్‌లోని అల్లీపురం శాఖలో మారంరెడ్డి గౌరికి బ్రాంచ్ మేనేజర్ సీ దేవేంద్రనాథ్ కుట్టుమిషన్ అందజేశారు. రీజనల్ మేనేజర్ ఎన్ శ్రీనివాసులు చొరవతో వారి పరిధిలోని 10 శాఖల్లో మహిళలకు కుట్టు మిషన్లు అందచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డు అధికారి శారద, క్యాష్ అధికారి మస్తాన్ బాబు పాల్గొన్నారు.



కుట్టు మిషన్ అందచేస్తున్న బ్యాంకు అధికారులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పడేనా!?

ఘన చరిత్ర కలిగిన నెల్లూరు నగరంలో ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా లేకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రముఖ డిగ్రీ కళాశాలగా కీర్తి గడించిన వీఆర్‌సీలో విద్యనభ్యసించిన ఎంతో మంది నేడు అత్యున్నత స్థానాల్లో రాణిస్తున్నారు. అలాంటి వీఆర్సీని 2021వ సంవత్సరంలో మూసివేశారు. అదే ఏడాది శ్రీసర్వోదయ, ఎస్‌వీజీఎస్(ఎయిడెడ్) కళాశాలలను కూడా ప్రభుత్వంలో విలీనం చేయడంతో అందులో పనిచేస్తున్న సిబ్బందిని వివిధ ప్రాంతాల్లోని కళాశాలలకు బదిలీ చేశారు. అప్పటి వరకు డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు మాత్రం పరీక్షలు నిర్వహించి కొత్త అడ్మిషన్ల ప్రక్రియను పూర్తిగా నిలిపివేశారు. ఆ తర్వాత విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లోనే చేరాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మాత్రం అందుబాటులో ఉండటంతో మహిళలకు ఊరట లభిస్తోంది. పురుషులు మాత్రం ప్రైవేట్ వైపు పరుగులు తీయక తప్పడం లేదు.

● ఇప్పటికే మూసివేసిన ఎయిడెడ్ కళాశాలలు ● పేద విద్యార్థులకు భారమైన ఉన్నత విద్య

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 15 : నెల్లూరు నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒక్కటీ లేదు. ఇది ప్రజా ప్రతినిధులు సిగ్గుపడాల్సిన విషయమని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి. ఎంతో మంది మేధావులు, విద్యావేత్తలు ఉన్న నెల్లూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం, ఉన్న కళాశాలలను మూసివేస్తున్నా అడ్డుకోకపోవడం దురదృష్టకరమంటున్నాయి. ఎంతో మంది పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు నెల్లూరులో ఉంటూ వారి పిల్లలను చదివించుకోవాలన్న ఆశతో జీవిస్తున్నారు. అయితే ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో అప్పులు చేసి మరీ ప్రైవేట్ కళాశాలల్లో చేర్పిస్తున్నారు.



మూసివేసిన వీఆర్ కళాశాల (ఫైల్)

● ఏటా వేలల్లో విద్యార్థులు..

నగరంలో ప్రతి ఏడాది 15వేల మందికిపైగా విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధిస్తున్నారు. వీరు ఇంటర్‌లో చేరడానికి బాలికలకు మాత్రం డీకేడబ్ల్యూ కళాశాల అందుబాటులో ఉండగా బాలురకు అరకొర వసతులతో ఒక్క కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలను మాత్రం నిర్వహిస్తున్నారు. మిగిలిన ఎయిడెడ్ కళాశాలలను మూసివేశారు. దీంతో ఇంటర్‌లో చేరాలనుకునే విద్యార్థులకూ 'ప్రైవేట్' భారం తప్పడం లేదు. కొందరు తల్లిదండ్రులు అప్పులు చేసి పిల్లలను చదివిస్తుండగా మరికొంతమంది ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు కట్టలేక చదువును మధ్యలోనే ఆపేసే పరిస్థితులు నెలకొన్నాయి.

● చితికిపోతున్న చిన్న కాలేజీలు

జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు 9, ఎయిడెడ్ 3, ప్రైవేట్ 57 కలిపి మొత్తం 69 డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిలో అడ్మిషన్లు పొందేందుకు మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు, న్యాక్ గుర్తింపు, జాతీయ ర్యాంకులను ఆధారంగా ఫీజులను నిర్ణయించినట్లు ప్రకటించారు. అయితే వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయని పలు చిన్న కళాశాలల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. రాజకీయ పలుకుబడి, అండదండలు, ఆర్థిక, అంగబలం ఉన్న కళాశాలలకు మాత్రం ఫీజులను పెంచేసి, చిన్న కళాశాలలపై చిన్నచూపు చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిలోనూ కీలకంగా వ్యవహరించే కళాశాలలకు ఒక్కసారిగా 30 నుంచి 50 శాతం ఫీజు పెంచేయడం దారుణమంటున్నారు. ఇప్పటికే కళాశాలలు నిర్వహించడం కష్టతరంగా మారిన నేపథ్యంలో ఫీజుల నిర్ణయం తమను మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించి నగరంలో ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇష్టం వచ్చినట్లు ఫీజులు

బీఎస్సీ కోర్సుకు రూ.15వేలు, బీకామ్‌కు 12వేలు, బీఏకు రూ.11వేలు, బీబీఏకు 18వేలు, బీసీఏకు 18వేలు, బీఎస్సీకి 30వేలు ఫీజులను సాధారణంగా నిర్ణయించారు. కానీ, కార్పొరేట్ కళాశాలలకు మాత్రం ఈ ఫీజుల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. బీకామ్ కొన్ని కాలేజీలు రూ.15వేలు, మరికొన్ని 20వేలు వసూలు చేస్తున్నాయి. బీఏకు రూ.16వేల వరకు వసూలు చేస్తున్నారు. బీబీఏకు, బీసీఏకు రూ.18వేల ఫీజు ఉండగా కొన్ని కార్పొరేట్ కళాశాలల్లో రూ.20వేలు, మరికొన్ని కళాశాలల్లో రూ.30వేల వరకు నిర్ణయించారు. బీఎస్సీకి కామన్‌గా అన్ని కళాశాలల్లో రూ.30వేల ఫీజును నిర్ధారించారు. గతంలో ఉన్న ఫీజు కంటే ఈ ఏడాది కొన్ని కోర్సులకు 20-30శాతం పెంచగా, కీలకమైన కోర్సులకు మాత్రం 30-50 శాతం ఫీజులను పెంచేశారు.

రెండు నెలలు ఓపిక పట్టండి.. వచ్చేది మన ప్రభుత్వమే !

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ



మీడియాతో మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 15 : కేవలం రెండు నెలలు ఓపిక పట్టండి.. మన తెలుగు దేశం ప్రభుత్వం వస్తుందని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ అన్నారు. గురువారం నగరంలోని 3వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికి తిరిగి టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిని స్థానికులకు గుర్తు చేశారు. అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంటింటికి తిరుగుతుంటే, నగరంలో నేను చేసిన అభివృద్ధిని నాకే స్థానికులు వివరిస్తుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పథకాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. టిడ్కో ఇళ్లను అర్హులందరికీ పంపిణీ చేస్తామని చెప్పారు. అప్పట్లో టిడ్కో ఇళ్లు పూర్తయినా ఎన్నికల కోడ్ రావటంతో ఇవ్వలేక పోయామ న్నారు. వైసీపీ పాలన ఐదేళ్లు పూర్తికావస్తున్నా టిడ్కో ఇళ్లను నేటికీ ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్ర మొత్తం మీద 114 మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్లను ఇవ్వకుండా ఈ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, విజేత రెడ్డి, విజయమ్మ, రమణయ్య, శైలజ, గోవర్ధన్, లక్ష్మి, సుధీర్, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ వస్తారు... మీ కష్టాలు తీరుస్తారు : రమాదేవి

నారాయణ వస్తారు.. మీ కష్టాలు తీరుస్తారు అంటూ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి ప్రజలకు భరోసా ఇచ్చారు. గురువారం 40వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి నారాయణను గెలిపించాలని కోరారు. భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో నాని, రాజేశ్వరి, తుమ్మల కృష్ణ, అమ్మణ్ణి, గండవరం దీక్షిత్‌బాబు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'వర్ధన్‌రెడ్డి' ఘనత



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 15 : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో వర్ధన్‌రెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని కళాశాల ప్రాంగణంలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాల ఐఐటీ-నీట్ అకాడమీ విద్యార్థిని ఎండీ అర్షియా 98.5 పర్సంటైల్‌తో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. మొత్తం 30 మంది విద్యార్థుల్లో 11 మంది విద్యార్థులు అర్హత సాధించారని చెప్పారు. మున్ముందు మరిన్ని విజయాలు సొంతం చేసుకుంటామని తెలిపారు.

160 సీట్లు టీడీపీ కైవశం

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 15 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో టీడీపీ, జనసేన కూటమి 57 శాతం ఓట్లతో 160 సీట్లు కైవశం చేసుకుంటుందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జోస్యం చెప్పారు. గురువారం నగరంలోని ఆయన కార్యాలయంలో గాంధీనగర్ ప్రాంతా నికి చెందిన యువతకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ ట్రెండ్ మారిందన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగి నా టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వంతో ప్రజలు విసిగి వేసారిపోయారన్నారు. అన్ని వర్గాల ప్రజలను దోచుకోవడమే జగన్ ప్రభుత్వం ధ్యేయంగా పెట్టు కుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, గంగాధర్, చెంచ య్య, అస్లాం, జిలానీ, గీతా కృష్ణ పాల్గొన్నారు.

ఆటోవాలాలతో ఆత్మీయ సమ్మేళనం



ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ఆటో డ్రైవర్లకు ఆర్థిక ప్రయోజనం మరింతగా లభించేలా టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో పెట్టేవిధంగా తనవంతు కృషి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఒక్కడినే ఒంటరిగా కార్యక్రమంలో భాగంగా 33వ రోజు గురువారం గాంధీనగర్‌లో ఆటో డ్రైవర్లతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారం లోకి వచ్చాక ఎక్కువగా నష్టపోయిన వర్గం ఆటోడ్రైవర్లేనని తెలిపారు. కాగా, ఫైవ్ ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ అనే వినూత్న కార్యక్రమాన్ని నెల్లూరు రూరల్ టీడీపీ ఆధ్వర్యంలో జీపీఆర్ కల్యాణ మండపంలో నిర్వహించారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఓటు కలిగిన ప్రతి విద్యార్థి తొలి ఓటును టీడీపీ సైకిల్ గుర్తుకు వేయాలని కోరారు. చదువుకున్న వారికి ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతితో ఆర్థిక ప్రయోజనం కలగాలంటే ఏపీలో చంద్రబాబు సీఎం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, తిరుమల నాయుడు, రమేష్ చౌదరి, జలదంకి సుధాకర్ పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీ'ని అనారోగ్యశ్రీగా మార్చారు : టీడీపీ

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 15 : రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని అనారోగ్యశ్రీగా మార్చిందని తెలుగుదేశం పార్టీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ షేక్ సిరాజ్ ఓ ప్రకటనలో విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఆరోగ్యశ్రీని పూర్తిగా భ్రష్టు పట్టించారన్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1200 కోట్లు బకాయి ఉందని తెలిపారు. సీఎం సొంత జిల్లా కడప సహా రాష్ట్రంలోని అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రులు బకాయిలు చెల్లించకపోతే ఇక పేదలకు వైద్యం చేయలేమంటూ తెగేసి చెబుతున్నాయన్నారు. ఫ్యామిలీ డాక్టర్ పథకం పెద్ద పబ్లిసిటీ స్టంట్ అని ఆరోపించారు. వచ్చే టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ ఆసుపత్రుల తీరు మారుస్తారని, అన్ని సదుపాయాలు సమకూరుస్తారని తెలియచేశారు

జనసేనలో చేరికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 15: నగరంలోని బృందావనంలో గల జనసేన పార్టీ కార్యాలయంలో నెల్లూరు రూరల్ యువజన సైనికుడు ప్రసన్న ఆధ్వర్యంలో పలువురు యువకులు గురువారం పార్టీలో చేరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిద్దు, రాజేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 15 : నగరంలోని 6వ డివిజన్ పప్పులవీధిలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు గురువారం ఆందోళనకు దిగారు. పార్కు, మున్సిపల్ కంప్లెక్స్ స్థలాన్ని అధికార పార్టీకి చెందిన నాయకులు ఆక్రమించుకుని దుకాణం నిర్మిస్తున్నారని ఆరోపించారు. దీనిపై తాము ఫిర్యాదు చేయడంతో సిటీ ప్లానింగ్ అధికారులు నోటీసులు అంటించి సరిపెట్టుకుంటున్నారని, తదుపరి చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీనిపై న్యాయస్థానంలోనూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

వెంకటలక్ష్మికి డాక్టరేట్



వెంకటలక్ష్మిని సత్కరిస్తున్న సహచర ఉద్యోగులు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 15 : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ కే వెంకటలక్ష్మి అన్నా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. ఇన్వెస్టిగేషన్ అండ్ డ్యూరబులిటీ ఆఫ్ హైపోషెడ్యూల్ కాంక్రీట్ అండర్ కరోసివ్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశంపై వెంకటలక్ష్మి చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని చెప్పారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు.

నేడు భారత్ బంద్

ఆత్మకూరు, ఫిబ్రవరి 15: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం భారత్ బంద్ నిర్వహిస్తున్నట్లు సంయుక్త కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆత్మకూరు మండల కమిటీ నేతలు తెలిపారు. దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను అన్ని వర్గాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బంద్‌లో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన జరుగుతుందని, అందరూ పాల్గొనాలని కోరారు.

తిరుచానూరు ఆలయం వద్ద
భక్తురాలిపై దాడి

తిరుచానూరు, ఫిబ్రవరి 15: శ్రీవారి దేవేరి పద్మావతీ దేవి దర్శనానికి విచ్చేసిన ఓ భక్తురాలిపై ఆలయంలో విదులు నిర్వహిస్తున్న ప్రైవేటు భద్రతా సిబ్బంది దాడిచేసిన ఘటన గురువారం వెలుగుచూసింది. తమిళనాడు రాష్ట్రం సేలం ప్రాంతానికి చెందిన ఓ భక్తబృందం గురువారం ఉదయం అమ్మవారి దర్శనానికి విచ్చేసింది.ఆ సమయంలో తిరుప్పావడ సేవ జరుగుతుండడంతో ఆలయంలోకి సాధారణ భక్తులను అనుమతించలేదు. సేవముగిసే సమయానికి ఒక్కసారిగా భక్తులు క్యూలైన్ వద్దకు దూసుకువచ్చారు. ఆలయం గేట్ నంబరు 4 వద్ద సేలం భక్తబృందం దూసుకుని క్యూలైన్‌వద్దకు చేరుకున్నారు.ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు భద్రతా సిబ్బంది సురేష్, వారి మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన సురేష్ ఆ భక్తబృందంలోని ఓ మహిళ తలపై మ్యాన్‌ట్యాక్‌తో కొట్టడంతో ఆమెకు గాయమైంది. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది.ఈ విషయం తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు ఆమెను సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. భక్త బృందానికి సర్దిచెప్పి అమ్మవారి దర్శనం చేయించి పంపారు. దీనిపై ఆలయ విజిలెన్సు అధికారి రామమోహన్‌ను అడగ్గా ఆ భక్తురాలు తోపులాటలో క్యూలైన్లో కమ్మిపై పడి గాయపడిందని చెప్పారు.అంతే కానీ తమ సిబ్బంది దాడి చేయలేదన్నారు.ఇక్కడ పనిచేసే ఆర్జితం ఇన్‌స్పెక్టర్ గతంలో మ్యాన్‌ట్యాక్‌తో ఓ కానిస్టేబుల్‌పై దాడి చేయగా కేసు నమోదై అరెస్టు వరకు వెళ్లిన విషయం తెలిసిందే.

ఒక రోజు బ్రహ్మోత్సవానికి కొండ ముస్తాబు



ఆలయం వెలుపల, లోపల పుష్పాలంకరణ





గ్యాలరీల్లోకి చేరుకున్న భక్తులు

వాహనసేవల వేళలు

- ఉదయం 5.30 - 8గంటల మధ్య: సూర్యప్రభవాహనం
- 9 - 10: చిన్నశేషవాహనం, 11 - 12: గరుడ వాహనం
- మధ్యాహ్నం 1 - 2: హనుమంత వాహనం
- 2 - 3: చక్రస్నానం, 4 - 5: కల్పవృక్ష వాహనం
- 6 - 7: సర్వభూపాల వాహనం,
- రాత్రి 8 - 9: చంద్రప్రభ వాహనం

తిరుమల, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): సూర్యజయంతి సందర్భంగా శుక్రవారం జరగనున్న రథసప్తమి వేడుకలకు తిరుమలలో సుందరంగా ముస్తాబైంది.శ్రీవారి ఆలయంతో పాటు పలు ప్రదేశాల్లో చేసిన పుష్పాలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకించి విద్యుత్ కాంతుల్లో వెంకన్న క్షేత్రం దేదీప్యమానంగా మారింది. ఆలయం లోపల 4 టన్నుల, వెలుపల 3 టన్నుల సంప్రదాయ పుష్పాలతో అలంకరణలు చేశారు. ప్రత్యేకించి 50 వేల కట్‌ఫ్లవర్స్‌తో ఆలయంలోని పలు ప్రదేశాలను సౌందర్యవంతంగా తీర్చిదిద్దారు. వాహనమండపాన్ని ప్రత్యేకమైన పుష్పాలు, పండ్లతో అలంకరించారు.శ్రీవారి ఉత్సవమూర్తులు ఊరేగే సూర్యప్రభ వాహనంతో పాటు మరో ఆరు ప్రధాన వాహనాలను సిద్ధం చేశారు.వాహన సేవలను వీక్షించేందుకు గురువారం సాయంత్రం నుంచే భక్తులు తిరుమల ఆలయం ముందు, మాడ వీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుంటున్నారు.రద్దీ పెరిగిన నేపథ్యంలో సీఆర్వోలో గదులు పొందడానికి భక్తులు లేపాక్షి సర్కిల్ వరకు క్యూలైన్‌లో బారులు తీరారు. గదులు లభించని భక్తులు షెడ్లు, కార్యాలయాల, ఫుట్‌పాత్‌లపై సేదదీరుతున్నారు. వృద్ధులు, పిల్లలు చలికి ఇబ్బందిపడుతున్నారు.

- సింహం దాడితో యాత్రికుల్లో పెరుగుతున్న ఆందోళన
- గతంలో మెట్ల దారిలో చిరుత... ఇపుడు పార్కులో సింహం మ్యానీటర్లుగా మారిన వైనం



ప్రహ్లాద్ గుర్జర్‌ను చంపేశాక ఎన్‌క్లోజర్‌లోకి చేరిన సింహం



సింహం దాడిలో చనిపోయిన ప్రహ్లాద్ గుర్జర్

జూలోనూ భద్రత కరువేనా?

తిరుమల యాత్రికులకు నడక దారిలోనే కాదు చివరికి తిరుపతి జూపార్కులో కూడా భద్రత లేదా అన్న ప్రశ్న శ్రీవారి భక్తలోకాన్ని కలవరపరుస్తోంది. అభయారణ్యంలో చుట్టూ కంచెలు, అంక్షలు లేని చోట్ల చిరుతల సంచారాన్ని నియంత్రించడం అసాధ్యమని సరిపెట్టుకున్నా కట్టుదిట్టమైన ఏర్పాట్లు వుండే జూపార్కులోనూ సందర్శకులకు భద్రత లేకపోవడం అన్ని వర్గాలనూ ఆందోళనకు గురి చేస్తోంది. గురువారం మధ్యాహ్నం తిరుపతి ఎస్వీ జూపార్కులో రాజస్థాన్ సందర్శకుడు ప్రహ్లాద్ గుర్జర్ (38) నేరుగా సింహాల ఎన్‌క్లోజర్‌లో దూకి సింహం దాడితో దుర్మరణం పాలైన ఘటన అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.

- తిరుపతి అర్బన్/నేరవిభాగం / తిరుపతి - ఆంధ్రజ్యోతి

సింహం మ్యానీటర్‌గా మారితే?

జూపార్కులోని సింహాల ఎన్‌క్లోజర్‌లో ఇప్పటి వరకూ సందర్శకులపైన, సిబ్బందిపైనా సింహాలు దాడి చేసిన ఉదంతాలు లేవు. గతంలో అభయారణ్యం నుంచీ జూపార్కులోకి ప్రవేశించిన ఓ చిరుత దాడి చేయడంతో ఉద్యోగి ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. అది మినహా చెప్పుకోదగిన ఘటనలు లేవు. తాజాఘటనలో సింహం దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో పాటు వంద నుంచీ రెండు వందల మీటర్లు లాక్కెళ్ళింది. ఆ క్రమంలో సింహం మనిషి రక్తం, మాంసాన్ని రుచి చూసింది. ఇది మ్యానీటర్‌గా మారుతుందా అన్న భయం జూపార్కు యంత్రాంగాన్ని వేధిస్తోంది. సింహం మళ్ళీ దాడులకు పాల్పడితే జూపార్కులో వైద్యులు, సిబ్బంది ప్రాణాలకు రక్షణ కల్పించడం కష్టమవుతుంది. రోజూ జూపార్కుకు సగటున 1500మంది సందర్శకులు వస్తున్నారు. వారు కొనుగోలు చేసే టికెట్లతోనూ, విరాళాలతోనూ జూ నడుస్తోంది. ఇపుడీ ఘటనతో సందర్శకుల సంఖ్య తగ్గితే మొత్తం మీద పార్కు నిర్వహణే సమస్య అవుతుంది. దీన్ని దృష్టిలో వుంచుకుని జూపార్కు అధికార యంత్రాంగం తక్షణం దిద్దుబాటు చర్యలు తీసుకుని, సిబ్బందికి, సందర్శకులకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సిన అవసరముంది.

సిబ్బంది లేకపోవడం కూడా...

లయన్ ఎన్‌క్లోజర్‌కు వెళ్లే మార్గంలో మొదటి గేటు పది అడుగుల ఎత్తున్నప్పటికీ సిబ్బంది కాస్త దూరంలో ఉండడంతో ప్రహ్లాద్ సులభంగానే గేటును దాటాడు. ఇనుప కంచె ఉన్న ప్రదేశంలో సిబ్బంది లేకపోయినా... గేటు ఎక్కడ ఉంటే అక్కడ ఒకరైనా సిబ్బంది ఉంటే ఇలాంటి ప్రయత్నం చేసేవారిని అడ్డుకునే అవకాశం ఉండేది.మధ్యాహ్న భోజనం సమయం అయినందున సిబ్బందిలో ముగ్గురు నలుగురు ఒకేసారి భోజనానికి వెళ్లడం కూడా ఈ పరిస్థితికి అవకాశం ఇచ్చింది. అలా అందరూ ఒకేసారి కాకుండా వంతులవారీగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిఉంది.

నడక దారి చిరుత దాడులతో బెంబేలు

తిరుపతి నుంచీ తిరుమలకు కాలినడక వెళ్ళే అలిపిరి మెట్ల మార్గంలో చిరుతలు, ఎలుగుబంట్లు, కొండ చిలువలు ఎన్నో ఏళ్ళుగా భక్తులను ఆందోళనకు గురి చేస్తూనే వున్నాయి. తరచూ మెట్ల దారిలో, మధ్య మధ్యన నడక దారిలో, అడపాదడపా ఘాట్ రోడ్లులోనూ ఇవి సంచరిస్తూ వుంటాయి. అయితే చిరుతలు భక్తులపై దాడి చేసేందుకు యత్నించడం మాత్రం 2010 నుంచీ మొదలైంది. ఆ ఏడాది జూలై 27న కోకిల అనే మూడేళ్ళ వయసున్న చిన్నారిపై అలిపిరి నడక మార్గంలో చిరుత దాడి చేసింది. దాడిలో చిన్నారి గాయపడగా కుటుంబీకులు, భక్తులు కేకలు పెట్టడంతో పాపను వదిలి చిరుత పరారైంది. మరో వారానికే ఆగస్టు 2న అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం పెంచలపాడు గ్రామం నుంచీ గోవిందప్ప, గీతమ్మ దంపతులు కుటుంబంతో నడచి కొండకు వెళుతుండగా వారి ఎనిమిదేళ్ళ కుమార్తె కళ్యాణిపై చిరుత పులి దాడి చేసింది. మెడను కొరికి పట్టుకుని పంజాతో భుజాలపై గాయపరిచింది. అప్పుడు కూడా తల్లిదండ్రులు, బంధువులు, ఇతర భక్తులు గావుకేకలు పెట్టడంతో చిరుత చిన్నారిని విడిచి పారిపోయింది. తర్వాత పుష్కరం పాటు చిరుతలు కనిపించడం తప్ప దాడులు చేసింది లేదు. 13 ఏళ్ళ తర్వాత గతేడాది జూన్ 22న కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మూడేళ్ళ కౌశిక్‌పై చిరుత పులి దాడి చేసి మెడ పట్టుకుని అడవిలోకి లాక్కెళ్ళింది. తల్లిదండ్రులు, భక్తులు, చిరువ్యాపారులు కొంతదూరం వెంబడించినా ఫలితం లేకపోయింది. అయితే రిపీటర్ స్టేషన్ సిబ్బందికి చిన్నారి ఏడుపు వినిపించడంతో వారు హుటాహుటిన అడవిలోకి వెళ్ళి ప్రాణాలతో వున్న చిన్నారిని కాపాడి ఆస్పత్రికి తరలించారు. స్వల్ప గాయాలతో బాలుడు బయటపడడం అందరినీ అబ్బురపరిచింది. తర్వాత గతేడాదిలోనే ఆగస్టు 12న నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం నుంచీ వచ్చిన కుటుంబంలో ఆరేళ్ళ చిన్నారి లక్షిత చిరుత దాడికి బలైంది. ఈ ఘటన భక్తులతో పాటు అన్ని వర్గాలనూ తీవ్రంగా కలచివేసింది. టీటీడీ తర్వాత అటవీ శాఖ వన్యప్రాణి విభాగంతో చర్చించి పలు చర్యలు తీసుకునేందుకు యత్నించింది. అందులో ప్రధానంగా బోన్లు ఏర్పాటు చేసి నాలుగు చిరుతలను బంధించారు. కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేసి వాటి కదలికలు గుర్తించి భక్తులను నడకదారిలో అప్రమత్తం చేస్తున్నారు.

ఇలా అయితే ఎలా?

పకడ్బందీ ప్రహరీ గోడ, లోపల జంతువులకు విడివిడిగా ఎన్‌క్లోజర్లు, వాటికి కాపలా, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ వంటి చర్యలతో పటిష్టంగా వున్నట్టు కనిపించే జూపార్కులో భద్రత ఎంత డొల్లగా ఉందో ఈ సంఘటన వెల్లడిస్తోంది.గురువారం ఘటనలో సందర్శకుడు ఉద్దేశపూర్వకంగా సింహాల ఎన్‌క్లోజర్‌లోకి దూకి వుండచ్చు. అయితే మద్యం మత్తులోనో, మతి స్థిమితం లేకనో, ఆత్మహత్య చేసుకోవాలనో ఎవరైనా జూపార్కు సింహాల ఎన్‌క్లోజర్‌లోకి దూకేస్తే పరిస్థితి ఏమిటి? అడ్డుకోవడానికి వీలుగా భద్రతా వ్యవస్థ ఉందా? సందర్శకులు అత్యుత్సాహంతో ఎన్‌క్లోజర్‌లోకి దిగి జంతువులకు హాని తలపెడితే బాధ్యత ఎవరిది? సెల్ఫీల పిచ్చి పరాకాష్టకు చేరిన కాలంలో ఇటువంటివి జరిగే అవకాశాలున్నాయి. వీటిని నిరోధించేందుకు తగిన నిఘా వ్యవస్థ అవసరం అని తాజా సంఘటన చెబుతోంది.



లయన్ ఎన్‌క్లోజర్‌లోకి వెళ్లేందుకు ప్రహ్లాద్ గుర్జర్ ఉపయోగించుకున్న వాటర్ ట్యాంకు


సీసీ కెమెరాలు లేవు

జూలో గురువారం ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు కూడా లేకపోవడం లోపంగానే చెప్పాలి.కెమెరాలు వుండి వుంటే ప్రహ్లాద్ గుర్జర్ అక్కడికి ఎపుడు వచ్చాడనే విషయం తెలిసేది. కావాలని చేశాడా లేక అనుకోని విధంగా అలా జరిగిందా అనేవిషయం తెలుసుకోడానికి వీలయ్యేది. సీసీ కెమెరాల మానిటరింగ్ సిబ్బంది అనుమానాస్పదంగా తిరుగాడేవారిని తక్షణం గుర్తించి సిబ్బందిని అప్రమత్తంచేసి దుర్ఘటనలకు ఆస్కారం లేకుండా చూసుకోగలిగేవారు.

అపరిచితులు

● 130గడపల వైఆర్‌కండ్రిగలో ఊరివాళ్లకు తెలీని 40 మందికి ఓట్లు

తిరుచానూరు, ఫిబ్రవరి 15: ఆ ఊళ్లో ఉండేది 130 గడపలు. ఓట్ల సంఖ్య 700. అయితే అందులో 40 ఓట్లున్న మనుషులు ఎవరో ఆ ఊళ్లో ఎవరికీ తెలీదు. 40 అపరిచితుల ఓట్లు నమోదై ఉన్న ఆ ఊరి పేరు వైఆర్‌కండ్రిగ (యాగప్పరెడ్డికండ్రిగ). చంద్రగిరి నియోజకవర్గంలోని రామచంద్రాపురం మండలంలో ఉంది. ఇక్కడి పోలింగ్ బూత్ 390లో 40 మంది వరకు అపరిచిత ఓటర్లుండడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఇదే ఊళ్లో మరణించిన 40మంది ఓట్లు కూడా తొలగించకుండా ఉంచేశారని చెబుతున్నారు. ఇదంతా వైసీపీ నాయకుల కుట్ర అని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. టీడీపీ సానుభూతిపరులు ఎక్కువగా ఉండే ఆర్‌సీపురం మండలం అంటే వైసీపీ నేతలకు కంటగింపుగా మారిందని, ఆధిపత్యం కోసం ఇప్పటికే వైసీపీకి అనుకూలంగా ఉన్న కొన్ని గ్రామాలకు పోలింగ్ కేంద్రాలను తరలించారని చెబుతున్నారు.అందులో భాగంగానే వైఆర్‌కండ్రిగకు పోలింగ్ కేంద్రం మార్పు చేసినట్లు టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ అపరిచిత ఓట్ల నమోదు కూడా ఇలాగే జరిగి ఉండచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బీఎల్వోల పనితీరు ఎలా ఉందో అర్థం అవుతోందని, వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆర్‌సీపురం మండలం వైఆర్‌కండ్రిగ పోలింగ్ కేంద్రంలో అపరిచిత ఓటర్లు - వైఆర్‌కండ్రిగ ఓటరు జాబితాలో కొనసాగుతున్న మృతుల ఓటర్లు



వలంటీర్లకు పురస్కారాలు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: వలంటీర్లు నిజమైన ప్రజాసేవకులుగా పని చేయాలని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి సూచించారు. గురువారం సాయంత్రం తిరుపతి కలెక్టరేట్ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ గురుమూర్తి తదితరులతో కలిసి వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.37మంది వలంటీర్లకు సేవా వజ్ర ప్రశంసాపత్రంతో పాటు రూ.45వేల చొప్పున, 216మందికి సేవారత్న ప్రశంసాపత్రంతో పాటు రూ.30వేల చొప్పున ,11,413మందికి సేవామిత్ర ప్రశంసాపత్రంతో పాటు రూ.15వేల చొప్పున అందజేశారు.

కత్తితో నరికి... గొంతు కోసి

- మిత్రుడి చేతిలో వడ్డీ వ్యాపారి దారుణ హత్య
- ఆర్థిక లావాదేవీలే కారణమంటున్న పోలీసులు



నిరంజన్ (ఫైల్‌ఫొటో) - సోము

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 15:తిరుపతి రూరల్ మండలం, మల్లంగుంట వద్ద గురువారం సాయంత్రం ఒక వడ్డీ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యారు.సీఐ తమీమ్ అహ్మద్ కథనం ప్రకారం... ఎస్టీవీ నగర్‌కు చెందిన విశ్రాంత సబ్‌రిజిస్ట్రార్ కృష్ణయ్య కుమారుడు నిరంజన్ వడ్డీ వ్యాపారం చేస్తుంటాడు. మల్లంగుంట హరిజనవాడకు చెందిన స్నేహితుడు సోముతో ఆర్థిక లావాదేవీల కారణంగా కొంతకాలం క్రితం గొడవ జరిగింది. అప్పటినుంచి ఇద్దరు ఎడమొహం పెడమొహంగా ఉంటున్నారు.గురువారం నిరంజన్ తన స్నేహితులతో కలిసి తుడా ప్లాట్స్ వద్ద మద్యం సేవించాడు.నిరంజన్ అక్కడున్నట్టు తెలుసుకున్న సోము ఆ ప్రదేశానికి చేరుకుని కత్తితో అతనిపై దాడిచేశాడు. గొంతు కోసి హతమార్చి పరారయ్యాడు. గొంతు సగానికి పైగా తెగిపోవడంతో నిరంజన్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ తమీమ్ అహ్మద్, ఎస్ఐ షేక్షావలి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి చెందిన కారులో, ఘటనా ప్రదేశంలో ఆధారాలను సేకరించారు.సోము హత్యకు పాల్పడ్డట్టు గుర్తించారు.పోస్టుమార్టం నిమిత్తం నిరంజన్ మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. సోము పాత నేరస్తుడని, తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అతడిపై మూడు హత్య కేసులు ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. పరారైన అతడి కోసం గాలిస్తున్నారు.

ప్రతి బూత్‌లోనూ దొంగ ఓట్లు

ఎన్నికల అధికారికి మాజీ జడ్పీటీసీ, ఐటీడీపీ నేత ఫిర్యాదు



అధికారికి ఫిర్యాదు చేస్తున్న రామచంద్రయ్య నాయుడు, వెంకటరమణ

డక్కిలి, ఫిబ్రవరి 15: మండలంలోని ప్రతి పోలింగ్ బూత్‌లోనూ దొంగ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు ఉన్నాయని ఎన్నికల అధికారి సుధీర్‌కి గురువారం మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, ఐటీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఘట్టమనేని వెంకటరమణ ఫిర్యాదుచేశారు. 42 బూతుల్లోనూ ఇదే పరిస్థితి అని తెలిపారు. దీనిపై తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇలాగే వ్యవహరిస్తే మాజీ ఎమ్మెల్యే గొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి



గూడూరులో జరిగిన ప్రదర్శనలో వామపక్ష నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 15: సంయుక్త కిసాన్ మోర్చా, భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జరగనున్న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్ష నాయకులు అన్నారు. గురువారం పట్టణంలో వామపక్షాల ఆధ్వర్యంలో బంద్ విజయవంతం చేయాలంటూ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. శివకుమార్, బీవీరమణయ్య, సురేష్, ప్రసాద్, శేఖరాచారి, మధు, మణి, ప్రభాకర్, శశికుమార్, శ్రీరాములు, చంద్రయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: బంద్‌ను విజయవంతం చేయాలని వెంకటగిరిలోనూ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీవీ రమణయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఆ జీవోలను అమలు చేయాలి

నాయుడుపేట, ఫిబ్రవరి 15: మున్సిపల్ కార్మికులకు ఒప్పందాల జీవోలను ప్రభుత్వం అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికురాలు నిర్మలమ్మ మృతి చెందడంతో గురువారం ఆమె భౌతికకాయానికి నివాళి అర్పించారు. కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇచ్చి, రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు.

విద్యాసామగ్రి వితరణ



వెంకటగిరి, ఫిబ్రవరి 15: విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో మొక్కలపాడు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో గురువారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ శంకర్, అధికారులు వెంకటసుబ్బయ్య, మంజునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రామమోహన్‌రావు

గూడూరు, ఫిబ్రవరి 15: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఆడిటర్ శ్రీకంఠి రామమోహన్‌రావు అన్నారు. గురువారం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, చెస్ పోటీలను నిర్వహించారు. కమిటీ సభ్యుడైన ఆడిటర్ మాట్లాడుతూ.. పాఠశాలను ఏర్పాటు చేసి గత ఏడాదితో వందేళ్లు పూర్తయ్యిందన్నారు. దాంతో పూర్వ విద్యార్థులంతా కమిటీగా ఏర్పడి పాఠశాల అభివృద్ధికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నీలిశెట్టి ఉమాశంకర్, హెచ్ఎం భారతి, పీడీలు శివకుమార్, సుబ్రహ్మణ్యం, రమేష్, శ్రీనివాసులు, విజయలక్ష్మీ, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

కోట, ఫిబ్రవరి 15 : వేసవికాలం వచ్చేస్తున్న నేపథ్యంలో గ్రామాల వారీగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నందకుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీల కార్యదర్శులు సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో తాగునీటిపై సమీక్షించారు. స్వర్ణముఖినది పరివాహక గ్రామాల్లోని అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా సాగునీటి సమస్య తలెత్తకూడదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ హేమంత్ కుమార్, ఏపీఎం రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రాకూడదు

చిట్టమూరు, ఫిబ్రవరి 15: వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సాయిలహరి ఆదేశించారు. గురువారం పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని 23 పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించాలని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన సీఎం జగన్: బీజేవైఎం



సమావేశంలో ప్రసంగిస్తున్న మనోజ్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 15: నిరుద్యోగులను సీఎం జగన్ మోసం చేశాడని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్ కుమార్ విమర్శించారు. గురువారం బీజేవైఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ పేరుతో 25వేల ఉద్యోగాలను భర్తీ చేస్తానని అధికారంలోకి వచ్చాక 600 పోస్టులతో దగా చేశాడని ఆరోపించారు. శివశంకర్, కమల్ పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దించాలి: పాశం



టీడీపీలో చేరినవారితో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దె దించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం కోట మండలం తిమ్మానాయుడుపాళెం పంచాయతీ నుంచి పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి దోచుకోవడమే పనిగా పాలన సాగిస్తుందన్నారు. అన్నివర్గాల ప్రజలు అవస్థ పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పనిచేసి టీడీపీని గెలిపించుకోవాలన్నారు. అనంతరం సంసిద్ధం అనే పోస్టర్లను విడుదల చేశారు. శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, మద్దాలి సర్వోత్తమరెడ్డి, బిల్లు చెంచురాయ్య, కోటేశ్వరరావు, జలీల్ అహ్మద్, కోటేశ్వరరావు, బాలకృష్ణ, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారిత చంద్రబాబుతోనే సాధ్యం

మహిళా సాధికారత చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. గురువారం అశోక్‌నగర్ ప్రాంతంలో బాబుషూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యమక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, నరసింహులునాయుడు, జనార్ధన్‌రెడ్డి, గాయంరమణయ్య, గురవయ్య, భారతి, తూపిలి ప్రకాష్, రాజ్యలక్ష్మీ, అరవ శ్రీనివాసులు, సురేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లూరులో భవిష్యత్తుకు గ్యారెంటీ



చిట్టమూరు, ఫిబ్రవరి 15: ఎల్లూరు, ముక్కిడిపాళెంలో భవిష్యత్తుకు కార్యక్రమం గురువారం జరిగింది. టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు దువ్వూరు మస్తాన్‌రెడ్డి, కామిరెడ్డి సునీల్‌రెడ్డి, మారంరెడ్డి జనార్దన్‌రెడ్డి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, గుంపర్ల చిన్నారావు, కాపులూరు చెంచురామయ్య ఆచారి, కల్లూరు మణి, మురళీధర్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

← మహిళకు కరపత్రం అందజేస్తున్న గణపర్తి కిషోర్‌నాయుడు

ఆటోను ఢీకొన్న బస్సు

ఆటోడ్రైవర్ దుర్మరణం, మరొకరికి తీవ్రగాయాలు



ప్రమాదానికి గురైన ఆటో (ఇన్‌సెట్లో) మృతి చెందిన ఆటో డ్రైవర్



గాయపడ్డ వీరాస్వామి

దొరవారిసత్రం, ఫిబ్రవరి 15: ఆటోను బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఆటోడ్రైవర్ దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. తనియాలికి చెందిన ఆటోలో డ్రైవర్ నేలనూరు వెంకటేశ్వర్లు (43)తో కలిసి పల్లూరు వీరాస్వామి దొరవారిసత్రం నుంచి స్వగ్రామానికి బయల్దేరారు. గురువారం తెల్లవారు జామున మావిళ్లపాడు క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపైకి వచ్చేసరికి చెన్నై నుంచి హైదరాబాదుకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఆటోడ్రైవర్ ఆటో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలోని వీరాస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో వారు బస్సును స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన వ్యక్తిని ప్రాథమిక చికిత్స చేశాక మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు.

మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ సభ



సభలో ప్రసంగిస్తున్న డీఆర్వో పెంచలకిషోర్

గూడూరు, ఫిబ్రవరి 15: తుంగపాళెం గ్రామంలో గురువారం మైనింగ్ కంపెనీపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. డీఆర్వో పెంచకిషోర్ మాట్లాడుతూ.. గ్రామంలో శ్రీనివాస మైనింగ్ కంపెనీవారు మైనింగ్ నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకోవడంతో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. కొందరు అభ్యంతరాలను వ్యక్తం చేశారని, వీటిని ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. తహసీల్దారు కరుణ్‌కుమార్, కాలుష్యనియంత్రణ మండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా సభ: ప్రజాభిప్రాయ సేకరణ సభ నామమాత్రంగా నిర్వహించారని ఆల్‌ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యూనైటెడ్ ఫోరం అధ్యక్షుడు రవిరాఘవేంద్ర ఆరోపించారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి ప్రచారం లేకుండా సభను ఏర్పాటు చేయడం మంచికాదన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు



తడ, ఫిబ్రవరి 15: పూడికుప్పం పాఠశాలను గురువారం ఎంఈవో మల్లికార్జునరావు ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

కోట: మండల పరిధిలోని కొక్కుపాడులోని జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం మెనూలో తేడాలు వస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. హెచ్ఎంలకు పలు సూచనలిచ్చారు.

అభినందనలు



వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 15: స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో ఏపీపీ ప్రకృతి కుమార్ పలు సేవా కార్యక్రమాలు చేయడంపై గురువారం పీడబ్ల్యూ ఫెడరేషన్ సభ్యులు గురువారం అభినందనలు తెలిపారు. మురళి గౌడ్, గుర్రాల రమేష్, తుపాకుల మురళి, వీరభద్రయ్య, హరి, శ్రీను, రజిని, సుబ్బయ్య పాల్గొన్నారు.

భూ పంపిణీ చేయండి

సచివాలయం వద్ద దళితుల ధర్నా



వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 15: మండల పరిధిలోని పెట్లూరు సచివాలయం ఆనుకుని ఉన్న 519ఎకరాలను దళిత, గిరిజనులకు పంపిణీ చేయాలని వెంకటగిరి ఏరియా ఆర్గనైజర్ వడ్డిపల్లి చెంగయ్య అన్నారు. గురువారం దళితులతో కలిసి సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పెట్లూరు సర్వే నెంబరు1లో 238 ఎకరాలు, 12-1లో 519 ఎకరాలు భూమి ఉందన్నారు. పెట్లూరులో సెంటు భూమి లేనివారికి రెండెకరాల చొప్పున పంపిణీ చేయాలని కోరారు. మరోవైపు దళితులు సాగు చేసుకుంటున్న భూమిపై ఫారెస్టు అధికారులు దాడులు చేయడం మానుకోవాలన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్సీ పర్యటన

గూడూరు, ఫిబ్రవరి 15: మండలంలోని చెన్నూరు, తిప్పవరప్పాడు, కందలి, నెర్నూరు తదితర గ్రామాల్లో గురువారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా ఎన్నికలపై స్థానిక వైసీపీ నాయకులతో చర్చించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



గిరిధర్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

చిల్లకూరు, ఫిబ్రవరి 15: తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని టోల్‌ప్లాజా సమీపంలోని చుట్టుగుంట ప్రాంతంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పెద్దకాకాని గ్రామానికి చెందిన గిరిధర్‌రెడ్డి(22) మూడేళ్లుగా సూళ్లూరుపేటలోని శ్రీసిటీలో పనిచేస్తున్నాడు. స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై సూళ్లూరుపేట నుంచి బయల్దేరగా చుట్టుగుంట వద్దకొచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గిరిధర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

43 మద్యం బాటిళ్ల స్వాధీనం: ఒకరి అరెస్టు

గూడూరు, ఫిబ్రవరి 15: మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఓ వ్యక్తిని రైల్వే జీఆర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 43 మద్యం బాటిళ్లలను స్వాధీనం చేసుకున్నారు. రైల్వేజీఆర్‌పీ ఎస్ఐ కొండప్పనాయుడు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు బాలాజీనగర్‌కు చెందిన కృష్ణ అనే వ్యక్తి బెంగుళూరు నుంచి రూ.20వేల విలువ చేసే 43 మద్యం బాటిళ్లను శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో నెల్లూరుకు తరలిస్తున్నాడు. ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై రైలు నుంచి దిగగా అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

వాకాడు, ఫిబ్రవరి 15: ఓ వృద్ధురాలు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. పూడిరాయదొరువు పంచాయతీ ఓడపాళెం గ్రామం సమీపంలో ఉన్న చవకచెట్లలో గోను చెంగమ్మ (65) ఉరేసుకున్నారు. ఈమె స్వస్థలం చిట్టమూరు మండలం చిట్టమూరు హరిజనవాడగా గుర్తించారు. కుటుంబ కలహాల తోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

సినీ ఫక్కీలో రూ.15వేల అపహరణ

కోట, ఫిబ్రవరి 15: విద్యానగర్‌లో గురువారం సినీ ఫక్కీలో ఓ మహిళ వద్ద రూ.15వేలను అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వాకాడు మండలం గంగన్నపాళెంకు చెందిన పున్నూరు నాగరాజమ్మ విద్యానగర్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంకులో ఇంటి రుణానికి సంబంధించి రూ.15వేలను ఈఎంఐగా చెల్లించడానికి ఓ బ్యాగులో పెట్టుకుని బస్సుదిగారు. బ్యాంకు వైపునకు నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తి ఓ ద్విచక్ర వాహనంలోవచ్చి సినీ ఫక్కీలో బ్యాగును లాక్కెళ్లిపోయాడు. బాధితురాలు తేరుకుని, స్థానికులు వచ్చేలోపే పరారయ్యాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులకు మాజీమంత్రి పరామర్శ



డక్కిలి, ఫిబ్రవరి 15: కమ్మపల్లెలో ఇటీవల మృతి చెందిన సంక్రాంతి వెంకటసుబ్బానాయుడు కుటుంబాన్ని గురువారం మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి పరామర్శించారు. వెంబులూరులో అనారోగ్యంతో బాధపడుతున్న పాయశం ఈశ్వరయ్యను పరామర్శించి, దేవులపల్లిలో పాపిరెడ్డి, మాధవాయపాళెంలో మాధమాల పెంచలరెడ్డిలు మృతి చెందడటంతో వారి కుటుంబాలనూ ఓదార్చారు. అలాగే పలువురు బాధితులకూ పరామర్శించారు. ఆమెవెంట చింతల శ్రీనివాసులు రెడ్డి, నర్రావుల వేణుగోపాల్ నాయుడు, కోళ్లపూడి వేణు, వెలికంటి చెంచయ్య తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 15: సూళ్లూరుపేట పట్టణంలోని బీఎస్పీలో ఉన్న ఎస్కే పరీదా, శ్రీనివాసులు, బిశ్వాల్‌లతో పాటు మొత్తం 11 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఆర్‌అండ్‌బీ బంగ్లాలో గురువారం కాంగ్రెస్ నాయకులు చందనమూడి శివ, కన్నంబాక హరికృష్ణ సమక్షంలో వీరు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ నాయకులు ఎస్కే రజీయా, ఎస్కే యాసిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలను కాపాడండి

రోడ్డెక్కిన రైతులు



కోట, ఫిబ్రవరి 15 : ఎండుతున్న పంటలను కాపాడాలంటూ గురువారం చెందోడు వద్ద రైతులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. చెందోడు, విద్యానగర్, నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామాల రైతులు ఫిల్టర్ పాయింట్‌ల ద్వారా వరి సాగు చేపట్టామన్నారు. ప్రస్తుతం పంట వెన్ను, పొట్టదశలో ఉండగా ఇష్టారాజ్యంగా విద్యుత్ సరఫరా ఉండటంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేవలం ఏడు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తూ. అదీ గంటల తరబడి ఆపేసి.. విడతలవారీగా ఇస్తున్నారని వాపోయారు. ఇకనైనా సరిగా సరఫరా చేయాలంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

← చెందోడు వద్ద రోడ్డుపై నినాదాలు చేస్తున్న రైతులు

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి

తెలుగు యువత



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

వెంకటగిరి, ఫిబ్రవరి 15: రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హేమంత్‌చౌదరి, సుకుమార్, శివతేజా, నానీ, నాయకులు పద్మనాభం, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

9వ బెటాలియన్‌లో డీఐజీ తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న రాజకుమారి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 15: మండల పరిధిలోని 9వ బెటాలియన్‌ను ఏపీఎస్పీ డీఐజీ రాజకుమారి గురువారం తనిఖీ చేశారు. సమస్యలను ఆరాతీసి, పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ ప్రకాష్, అడిషినల్ కమాండెంట్ అరుణ్ బోస్, అసిస్టెంట్ కమాండెంట్ ఎమ్మెల్ మనోహర్, ఆనంద్ కన్నా, రామకృష్ణ, ఏవో చంద్రమౌళి, డాక్టర్ శేసమ్మ, కిరణ్‌ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

చెంగాళమ్మ సేవలో కమ్యూనికేషన్ డీఐజీ



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 15: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని గురువారం కమ్యూనికేషన్ డీఐజీ ఎస్ఎ్ఎజే లక్ష్మి కుటుంబ సభ్యులతో దర్శించుకొన్నారు. వీరికి ఆలయ సిబ్బంది స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. పాలక మండలి సభ్యుడు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26నుంచి భీమేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం

పెళ్లకూరు, ఫిబ్రవరి 15: మోదుగులపాలెం గ్రామంలో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు భీమేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కుంబాభిషేక వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఇరుగు వెంకటసుబ్బయ్య, ప్రకాశం, చెంగయ్య తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ పూర్తయ్యాక 28న అన్నదానం ఏర్పాటు చేసినట్లు దాతలు అమరావతి రామయ్య, మంగమ్మ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రైతులకు తప్పని సాగునీటి కష్టాలు



చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఆయిల్ ఇంజిన్లు

వాకాడు, ఫిబ్రవరి 15: మండలంలో వరి రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. దుగరాజపట్నం చెరువు సమీపంలో 150 ఎకరాలకు సాగునీరు అందక రైతులు ఇంజన్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. చెరువుకు స్వర్ణముఖినది నుంచి సాగునీరు అందకపోవడంతో ఆయకట్టు పరిధిలోని రైతులు ఆయిల్ ఇంజిన్లను పెట్టి చెరువు నుంచి నీటిని తోడేశారు. ప్రస్తుతం చెరువు ఖాళీ అయిపోతోంది. మరో నెలరోజులుపైగా వరిపైరును ఎలా కాపాడుకోవాలో తెలియడంలేదని ఆవేదన చెందుతున్నారు. తెలుగుగంగ జలాలను తీసుకురావడంలో వైసీపీ నాయకులు విఫలమయ్యారని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి తెలుగు గంగ జలాలను అందిస్తే కోలుకుంటామని చెబుతున్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

పెళ్లకూరు, ఫిబ్రవరి 15: తాళ్వాయిపాడులో గురువారం ఎన్నికలపై గ్రామస్తులకు నాయుడుపేట సీఐ జగన్‌మోహన్‌రావు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ శ్రీకాంత్ తదితరులున్నారు.

సేవతోనే సంతృప్తి

చిల్లకూరు, ఫిబ్రవరి 15: సేవా కార్యకమాలను నిర్వహించడం ద్వారానే సంతృప్తిని పొందుతామని పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజి అన్నారు. గురువారం స్థానిక జ్యోతివే బ్రిడ్జి కార్యాలయం ఆవరణలో తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే మధ్యాహ్నం అన్నదానం చేశారు. డానియల్ చిల్డ్రన్స్ హోమ్‌లోని చిన్నారులకు భోజనం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి నానాజి ఎంతో కృషిచేస్తున్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురెడ్డి, గుండాల లీలావతి, నెల్లటూరు చిరంజీవి, ప్రవీణ్‌రెడ్డి, కీరవాణి, కుమార్, రామ్మూర్తి, కరిముల్లా, రామచంద్రారెడ్డి, దినేష్, నవీన్, శంకరయ్య, వెంకటకృష్ణయ్య, పులిమి శ్రీనివాసులు, ఛాన్‌బాషా, వెంకటేశ్వర్లురాజు తదితరులు పాల్గొన్నారు. కాగా.. పులిమి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.



రక్తదాన శిబిరంలో పాశం సునీల్‌కుమార్, తానంకి నానాజి తదితరులు